



సెంచరీ సాధించిన యశస్వి జైస్వాల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు బహూకరణ

వార్ వన్‌సైడ్

కలిసొచ్చిన పిచ్‌పై కదం తొక్కిన టీమిండియా

దక్షిణాఫ్రికాపై ఘన విజయం

- సెంచరీతో చెలరేగిన యశస్వి జైస్వాల్
- అర్ధ సెంచరీలు చేసిన విరాట్, రోహిత్
- ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో మార్మోగిన స్టేడియం
- సౌతాఫ్రికా ప్లేయర్ డీ కాక్ సెంచరీ వృథా
- నాలుగేసి వికెట్లు తీసిన ప్రసిద్ధ్ కృష్ణ, కులదీప్ యాదవ్



క్రికెట్ అభిమానులతో కిక్కిరిసిన స్టేడియం

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): **కలిసొచ్చిన పిచ్‌పై భారత్ బ్యాటర్లు కదంతొక్కారు. సౌతాఫ్రికాపై ఆద్యంతం ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. సిరీస్‌లోని మొదటి రెండు మ్యాచ్‌లలో భారీ స్కోర్లు నమోదైనా, విజయం దోబూచులాడగా, పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో శనివారం జరిగిన కీలక మ్యాచ్‌లో భారత్ హవా కొనసాగింది. దీంతో తొమ్మిది వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించి సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది.**

టాస్ గెలిచిన భారత కెప్టెన్ కేఎల్ రాహుల్ దక్షిణాఫ్రికాను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. మ్యాచ్ ప్రారంభం నుంచి భారత్ బౌలర్లు రాణించడంతో దక్షిణాఫ్రికా పూర్తి ఓవర్లు ఆడకుండానే 270 పరుగులకు ఆలౌట్ అయింది. సౌతాఫ్రికా ఓపెనర్ డీ కాక్ బౌండరీలు, సిక్సర్లతో చెలరేగి సెంచరీ (106) సాధించగా, కెప్టెన్ బవుమా (48) భారత్ బౌలర్లను కొంతవరకు ఎదుర్కొన్నాడు. ప్రసిద్ధ కృష్ణ, కులదీప్ యాదవ్ అద్భుత బౌలింగ్‌తో చెరో నాలుగు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 39.5 ఓవర్లలో కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది.

భారత్ బ్యాటింగ్ విధ్వంసం

ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో భారత్ ఆటగాళ్ల బ్యాటింగ్ విధ్వంసం ప్రేక్షకులకు అసలైన క్రికెట్ మజాను అందించింది. సూపర్ ఫామ్‌లో ఉన్న రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లీకి ఓపెనర్ యశస్వి జైస్వాల్ తోడై విధ్వంసకర బ్యాటింగ్‌తో అజేయ సెంచరీ సాధించాడు. జైస్వాల్ సెంచరీతో కదంతొక్కడంతో ప్రేక్షకులు ... మిగతా 8వ పేజీలో

మరిన్ని ఫొటోలు, వార్తలు 8వ పేజీలో

రాజ్యాంగ నిర్మాతకు ఘననివాళులు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం వాడవాడలా ఆయన విగ్రహాలకు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాలు, దళిత సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశం గర్వించదగ్గ మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. నిమ్నవర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని శ్లాఘించారు.



అనకాపల్లి భీమునిగుమ్మం జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

స్పీకర్‌తో డోజ్కో కంపెనీ డైరెక్టర్లు భేటీ

అయ్యన్నపాత్రుడుని మర్యాదపూర్వకంగా కలిసిన యాజమాన్య ప్రతినిధులు



స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కలిసిన డోజ్కో కంపెనీ డైరెక్టర్లు

నర్సీపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మైనింగ్, నిర్మాణ రంగాల్లో వినియోగించే ఎర్త్ మూవర్స్ యంత్ర పరికరాలు, విడిభాగాలు తయారు చేసే 'డోజ్కో ఇండియా ప్రైవేటు లిమిటెడ్' కంపెనీ డైరెక్టర్లు శనివారం నర్సీపట్నం వచ్చి శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వంగా కలిశారు. మాకవరపాలెం మండలంలో రూ.1,234 కోట్లు పెట్టుబడితో ఎర్త్‌మూవర్స్ యంత్ర పరికరాలు, విడిభాగాలు తయారీ చేసే పరిశ్రమను ఏర్పాటు చేయడానికి డోజ్కో ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి ప్రభుత్వం ఇటీవల 150 ఎకరాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కంపెనీ డైరెక్టర్లు ఆర్‌కే బంగూరు, ఎన్‌జీ బంగూరు స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కలిసి పరిశ్రమ ఏర్పాటుపై చర్చించారు. పరిశ్రమ ఏర్పాటుకు సహకరించిన సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, మాకవరపాలెం మండలంలో భారీ పరిశ్రమ ఏర్పాటుతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందడమే కాకుండా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. స్పీకర్‌ను కలిసిన వారిలో డోజ్కో జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, ఆర్డీవో వీవీరమణ, తహశీల్దార్ రామారావు వున్నారు.

చోడవరం పంచాయతీ ఈవోపై ఎమ్మెల్యే ఆగ్రహం

వ్యాపారులు రోడ్డును ఆక్రమిస్తుంటే ఏం చేస్తున్నారని నిలదీత

- దుకాణదారుల తీరుపై అసంతృప్తి
- డ్రైనేజీ కాలువలపై కట్టడాలను తొలగించాలని ఆదేశం



పంచాయతీ ఈవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రహదారి పక్కన వుండే దుకాణదారులు క్రమేపీ రోడ్డును ఆక్రమించి మరీ ముందుకు వచ్చేస్తుంటే ఏం చేస్తున్నారంటూ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, పంచాయతీ ఈవో శ్రీనివాస్‌పై మండిపడ్డారు. శనివారం పట్టణంలోని లక్ష్మీపురం రోడ్డులో ... మిగతా 8వ పేజీలో

26 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఎలమంచిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టణంలోని ఒక రైస్‌మిల్లు వద్ద ఉంచిన సుమారు రెండున్నర టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి. స్థానిక రైల్వే స్టేషన్‌రోడ్డు సమీపంలోని ఒక రైస్ మిల్లుకు శనివారం ఉదయం ఆటోలో రేషన్ బియ్యం బస్తాలు వెళుతుండడాన్ని జనసేన కార్యకర్తలు చూశారు. వారు వెంటనే ఈ విషయాన్ని రాజీవ్‌గాంధీ క్రీడా మైదానంలో వున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన




రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, పౌరసరఫరాల డీటీ రాజేంద్రప్రసాద్

ద్విచక్ర వాహనంపై మిల్లు వద్దకు వచ్చి వాకబు చేశారు. అనంతరం పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దారు ... మిగతా 8వ పేజీలో

కాలుష్య కాసారం

ఫార్మా వ్యర్థాలను శుద్ధి చేయకుండా బయటకు విడుదల చేస్తున్న రాంకీ యాజమాన్యం

- నల్లగా మారుతున్న గెడ్డలు, చెరువుల్లో నీరు
- కలుషితం అవుతున్న భూగర్భ జలాలు
- తీవ్ర దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని పీసీబీ అధికారులు



ఫార్మా వ్యర్థాలు కలవడంతో మల్లోడి గెడ్డవాగులో నల్లగా మారిన నీరు

పరవాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): **పరవాడ ఫార్మాసిటీ డెవలపర్‌గా వ్యవహరిస్తున్న రాంకీ యాజమాన్యం నిబంధనలను తుంగలోకి తొక్కుతున్నది. రసాయన వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా నేరుగా బయటకు విడిచిపెడుతున్నది. ఈ వ్యర్థాలు సమీపంలోని గెడ్డలు, చెరువుల్లోకి చేరి కాలుష్య కాసారాలుగా మారుస్తున్నాయి. పరవాడ నుంచి భరణికం వెళ్లే రహదారిలో వున్న మల్లోడిగెడ్డ వాగు ఫార్మా వ్యర్థాలతో నిండిపోయి నీరంతా నల్లగా మారిపోయింది. దీనికితోడు తీవ్రదుర్గంధం వెదజల్లుతుండడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు.**

పరవాడలోని 'విశాఖ ఫార్మా సిటీ'లో పదుల సంఖ్యలో ఫార్మా కంపెనీలు వున్నాయి. వీటిల్లో ఆయా ఉత్పత్తుల అనంతరం విడుదలయ్యే వ్యర్థాలను శుద్ధి చేయడానికి 'కామన్ ఎఫ్లుయంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్' (సీఈటీపీ) వుంది. దీనిని ఫార్మా సిటీ డెవలపర్ అయినా 'రాంకీ' యాజమాన్యం నిర్వహిస్తున్నది. ఆయా కంపెనీల నుంచి రసాయన/ ఫార్మా వ్యర్థాలను ఈ ప్లాంట్‌లోకి తరలించి, శుద్ధి చేయాలి. ఇందుకుగాను రాంకీ యాజమాన్యం నిర్ణీత రుసుము వసూలు చేస్తుంది. అయితే వర్షాలు కురిసినప్పుడు రసాయన వ్యర్థాలను శుద్ధి చేయకుండా డ్రైన్ల ద్వారా బయటకు విడిచిపెడుతున్నారు. ఇవి సమీపంలోని గెడ్డల్లోకి, వాటిల్లో నుంచి సాగునీటి చెరువుల్లోకి చేరుతున్నాయి. ఈ ఏడాది మే 18వ తేదీ సాయంత్రం వర్షం కురుస్తున్న సమయంలో రాంకీ యాజమాన్యం వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా నేరుగా మల్లోడిగెడ్డవాగులోకి విడిచిపెట్టడంతో నీరంతగా నల్లగా తయారైంది. దీంతో భరణికం మాజీ సర్పంచ్ బొండా తాతారావు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పీసీబీ అధికారులు రాంకీ యాజమాన్యానికి ఈ ఏడాది జూన్ 18న నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఎఫ్లుయంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ రసాయన వ్యర్థాలను యథావిధిగా బయటకు విడిచిపెడుతున్నారు. ఫార్మా వ్యర్థాలతో పరవాడ పెద్ద చెరువు, ఊర చెరువు ఇప్పటికే కలుషితమయ్యాయి. ఇందులోని నీటిని పశువులు తాగడం లేదు. రైతుల ఈ చెరువు నుంచి పొలాలకు నీరు పెట్టడం మానేశారు. గెడ్డలు, చెరువులతోపాటు భూగర్భ జలాలు సైతం కలుషితం అవుతున్నాయి.

ఫార్మా వ్యర్థ జలాలను గెడ్డవాగులోకి విడిచిపెట్టడంపై 'ఫార్మా యాజమాన్యాల ఇష్టారాజ్యం' అనే శీర్షికతో గత ఏడాది ... మిగతా 8వ పేజీలో

నేడు ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్ష

- అనకాపల్లి, నర్సీపట్నంలో 17 కేంద్రాలు
- 3,994 మంది విద్యార్థులకు హాల్‌టికెట్లు జారీ
- ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు పరీక్ష

నర్సీపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ (ఎన్ఎంఎంఎస్)' అర్హత పరీక్ష జిల్లాలోని 17 కేంద్రాల్లో ఆదివారం నిర్వహిస్తున్నారు. ప్రతిభ వుండి, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడానికి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఏటా నవంబరు/ డిసెంబరు నెలల్లో ఈ పరీక్ష నిర్వహిస్తున్నది. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్/ ప్లస్2 వరకు ఏటా నిర్ణీత మొత్తంలో నగదు అందిస్తుంది. 2026-27 ... మిగతా 8వ పేజీలో

అంబేడ్కర్‌కు ఘన నివాళి



పాయకరావుపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



ఎస్.రాయవరంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

పాయకరావుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలో ఆయనకు ఘన నివాళులర్పించారు. మండల కాంప్లెక్స్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి తహశీల్దారు ఎస్‌ఏ.మహేశ్వరరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, రాష్ట్ర నాటక అకాడమి కార్పొరేషన్ డైరెక్టర్ పల్లా విలియంకేరి, టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పెదిరెడ్డి శ్రీను,తదితరులు పాల్గొన్నారు. పాత పంచాయతీ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పలువురు దళిత నాయకులు పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయ కులు పెదపాటి మేఘరంజన్, సూరా సుబ్రహ్మణ్యం, ఇంజరపు సూరి బాబు, ఐఎన్.మూర్తి, కువల కుమార్, ముక్కుడుపల్లి నాగరాజు తది తరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వడలి శివప్రకాశ్, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రావు జగ్గారావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు, ఏఐ ఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి ఎ.నవీన్‌రాజు, వి.కిరణ్, కె.ఏసుబాబు, పి.శామ్యూల్ పాల్గొన్నారు. స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి దళిత హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

అచ్యుతాపురం రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అచ్యుతాపురం భవాని విద్యానికేతన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి యాజమాన్యం, విద్యార్థులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఐటీ ప్రిన్స్‌పాల్ శ్రీనివాస్, స్కూల్ లైబ్రేరియన్ సుబ్బారావు, సిబ్బంది సూరప్పారావు, రాజు మాస్టర్, వి.నాగమణి, భవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటవురట్ల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని మండలంలోని కైలాసపట్నం, రాట్నాలపాలెం, కోటవురట్ల, చౌడువాడల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో తహశీల్దార్ గారా ఆనందరాజు, నాయకులు బుకా యేసుదాసు, పాండురాజు, మట్ల రాకేష్ మట్ల నర్సింహమూర్తి, మట్ల నూకరాజు పాల్గొన్నారు.

ఎలమంచిలి: మునిసిపాలిటీలోని మంత్రిపాలెంలో శనివారం డా. బీఆర్. అంబేడ్కర్ వర్ధంతిని స్థానిక నేతలు ఘనంగా నిర్వహించారు. ఎస్సీ మోర్చా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి తెరపల్లి అప్పలరాజు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ స్వదేశీ జాగరణ కన్వీనరు పప్పు ఈశ్వరరావు, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు దిగుమర్తి కనకరాజు, ఉపాధ్యక్షుడు ఎం. రమణ, యువమోర్చా నాయకులు కె.కుమార్, సింహాచలం, ప్రసాద్, బి. సూరిబాబు పాల్గొన్నారు.

నక్కపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మండల ప్రత్యేకాధికారిణి విజయ, ఎంపీడీవో బీ చైతన్య, ఏవో డీఎస్ రాజు, ఎంఈవో కె.నరేశ్, ఈవోపీఆర్‌డీ చలపతిరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాయకరావుపేట రూరల్: మండలంలోని గుంటపల్లి, సత్యవరం, పెదరాంభద్రపురం, శ్రీరాంపురం, మాసాహెబ్‌పేట, అరట్లకోట తదితర గ్రామాలలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు గెడ్డం బుజ్జి, కంకిపాటి వెంకటేశ్వరరావు, వైసీపీ నాయకులు గెడ్డమూరి శ్రీనివాసరావు, దనిశెట్టి బాబూరావు, దగ్గుపల్లి సాయిబాబా, త్రిపర్ణ శ్రీను, గోవిందు, చంటి, చక్రవర్తి పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఎస్.రాయవరంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ కె.వెంకటలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, వైస్‌ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ పార్కును ఎంపీపీ వెంకటలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బైపా శ్రీనివాసరావు, టీడీపీ నేత సోమిరెడ్డి రాజు, మాజీ వైస్ ఎంపీపీ కొణతాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: మండల కేంద్రంలో అంబేడ్కర్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ జి.సుధాకర్, డీవీఎంసీ సభ్యుడు రేబాక మధుబాబు, ఎం.అప్పలరాజు, తట్ట పెంటయ్య నాయుడు, రాజన్న బుజ్జిబాబు, బీలా శివగణేష్, ఎం సుజాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పాయకరావుపేట రూరల్: గుంటపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గెడ్డం బుజ్జి, తదితరులు

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. మునగపాక సచివాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి సర్పంచ్ దిమ్మల అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. నేవీకాలనీలో రాంబిల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఎరిపల్లి చిట్టిబాబు, తెలుగుయువత మండల అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్‌లు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పాలెపు అప్పలరాజు, ఎలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గరికిన గోవింద్, టీడీపీ నాయకులు వాసుపల్లి అప్పలరాజు, గెద్దాడ శ్రీనివాసరావు, వై.నారాయణరెడ్డి, చెల్లూరి కోదండరావు, లంకాడ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం

- రెవెన్యూ డివిజన్‌పై తీర్మానం
- ఎరువులు, నాసిరకం రోడ్డు నిర్మాణ పనులపై అధికారులను నిలదీసిన సభ్యులు



రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతపై సెల్‌ఫోన్‌లో చూపుతున్న దుప్పితూరు సర్పంచ్ శంకరరావు

అచ్యుతాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం శనివారం వాడీవేడిగా సాగింది. ఎంపీడీఓ సమావేశమందిరంలో జరిగిన సమావేశంలో తొలుత మడుతూరు ఎంపీటీసీ సభ్యుడు శనివాడ జువ్వాలనాయుడు ఎరువులపై వ్యవసాయాధికారి శంకర్ గోవింద్‌ని నిలదీశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఎరువులు ఉన్నాయని, ఇంతవరకు రైతులందరికీ ఎరువులు కొరత లేకుండా పంపిణీ చేశామన్నారు. ఎవరైనా ఎరువులు తీసుకోకుంటే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. దీనికి జువ్వాల నాయుడు మాట్లాడుతూ ఎరువులు తీసుకోవడానికి ఎక్కడికి రమ్మంటారో చెప్పాలని నిలదీశారు. అయితే ఎరువులు ఎక్కడ ఉన్నాయో చెప్పలేక వ్యవసాయాధికారి నీళ్లునమిలారు. దుప్పితూరు సర్పంచ్ దేశంశెట్టి శంకరరావు మాట్లాడుతూ నక్కపల్లిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అనంతరం సభ్యులందరూ అచ్యుతాపురంలో గాని, ఎలమంచిలిలో గాని రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయని సభ్యులు మండిపడ్డారు. అధికారులు, కాంట్రాక్టరు కుమ్మక్కై రోడ్డు పనులు నాసిరకంగా చేస్తున్నారన్నారు. దీనిపై విచారణ జరిపి కాంట్రాక్టరుతో పాటు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు గురించి అధికారులు ప్రచారం చేయడం లేదని కొండకర్ల పీఏసీఎస్ చైర్‌పర్సన్ గొంతిన భక్తసాయిరాం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సూర్యఘర్ పథకాన్ని అంతా వినియోగించుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాసరావు అన్నారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. అలాగే వివిధ నామినేటెడ్ పదవుల్లో నియమితులైన సభ్యులను సన్మానించారు. మండలాధ్యక్షురాలు కోన సంధ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీఓ బి. చిన్నారావు, డీటీ శ్యామ్ కుమార్, జెడ్‌పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, అధికారులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ మైదానం, ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

ఎలమంచిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌గాంధీ క్రీడామైదానం, ఇండోర్ స్టేడియాన్ని ఎమ్మెల్యే విజయకుమార్ సోమవారం పరిశీలించారు. శనివారం ఉదయాన్నే రాజీవ్ గాంధీ మైదానానికి చేరుకుని గోతులు పడిపోయి, తుప్పలతో అధ్వానంగా ఉండడాన్ని ఆయన పరిశీలించారు. మైదానంలో చేతి బోరు మూలకు చేరి పదేళ్ల కావస్తుందని, వర్షం పడితే మైదానం మొత్తం చెరువును తలపిస్తుందని, కొందరు బహిర్భూమిగా వినియోగిస్తున్నారని క్రీడాకారులు ఆయనకు వివరించారు. మైదానంలో క్రీడాకారుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆటవిడుపుగా క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. అనంతరం సమీపంలో ఉన్న ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించారు. స్టేడియం ఆవరణలో ఉన్న జనరేటర్లను చూసి వీటిని ఇక్కడ ఎందుకు ఉంచారని ప్రశ్నించారు. స్టేడియం నిర్వహణ తీరుపై క్రీడాకారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు కొఠారు నరేష్, కొఠారు శ్రీను, పూటకూటి రమేశ్, సతీశ్‌పాల్గొన్నారు.

'పేట'లో ట్రాఫిక్ జామ్



గౌతమ్ సెంటర్‌లో ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం

పాయకరావుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గౌతమ్ సెంటర్‌లో శనివారం రాత్రి ట్రాఫిక్ జామ్ అయ్యింది. ప్రతిరోజు ఈ సెంటర్‌లో సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు పలుమార్లు ట్రాఫిక్‌జామ్ అవుతున్నా పట్టించుకున్నవారు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో మెయిన్‌రోడ్డు ఇరువైపులా వ్యాపారుల ఆక్రమణలు, రోడ్డుపై తోపుడుబండ్లు నిలుపుదల, పలు షాపింగ్ మాల్స్, వ్యాపార కేంద్రాల ఎదుట వాహనాల నిలుపుదల చేస్తుండడంతో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నది. దీనికితోడు ఉదయం, సాయంత్రం స్కూల్ బస్సులు, హెటిరో, డక్కన్ కంపెనీల బస్సులు, ఆర్టీసీ బస్సులు, ఆటోలు ఎక్కడ పడితే అక్కడ నిలిపి వేస్తుండడంతో అడపాదడపా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతున్నది. ఈ క్రమంలో శనివారం రాత్రి గౌతమ్ సెంటర్‌లో పలుమార్లు ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు స్పందించి రోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో గౌతమ్ థియేటర్, మంగవరం సెంటర్‌లలో ట్రాఫిక్ సమస్య లేకుండా చేయాలని పలువురు కోరుతున్నారు.

'విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం'

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టాలపై కనీస పరిజ్ఞానం కలిగి ఉండాలని ఎస్‌ఐ పురుషోత్తం అన్నారు. మండలంలోని మంగవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు వివిధ చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. వీటి వలన కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించారు. పోలీసు స్టేషన్ వ్యవస్థ, కేసులు నమోదు, ప్రక్రియ, నేరస్తులను పట్టుకునే విధానం, మహిళలు, పిల్లల రక్షణకు ఉన్న చట్టాలు, ట్రాఫిక్ నియమాలు రోడ్డు భద్రత, సైబర్ ఫ్రాడ్, గుడ్ టచ్, బాడ్ టచ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన

ఎస్.రాయవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరంలో శనివారం డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనంతరం పారిశుధ్యంపై ఆయన స్థానికులకు అవగాహన కల్పించారు.

భూవివాదాలు పరిష్కరించాలి

కోటవురట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల లెవెల్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో భూసమస్యలను పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారిణి శోభరాణి అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల లెవెల్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం తహశీల్దార్ తిరుమలబాబు, మండల స్థాయి అధికారులు, పోలీసులు సమక్షంలో జరిగింది. ఈ సమావేశంలో కోటవురట్ల, పీకేపల్లి, టి.జగ్గంపేట, జల్లూరు గ్రామాల్లో భూ సమస్యలపై ఇరువర్గాల వాదోపవాదాలు విన్నారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా ఇరువర్గాలు ఒక అభిప్రాయానికి రాకపోవడంతో వాయిదా వేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏఎస్‌ఐ గంగారాజు, డీటీ రమేశ్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు సబ్సిడీపై ఇంజన్ల పంపిణీ



మత్స్యకారులకు సబ్సిడీపై ఇంజన్లు అందజేస్తున్న వెంకటేశ్

నక్కపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా 40 శాతం సబ్సిడీపై మంజూరైన ఇంజన్లను శనివారం హోం మంత్రి అనిత క్యాంప్ కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ పంపిణీ చేశారు. రాజయ్యపేట గ్రామానికి చెందిన 10 మంది మత్స్యకారులకు రాయితీపై ఇంజన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, పార్టీ నాయకుడు కురందాసు నూకరాజు, మత్స్యకార నాయకులు గోసల చినతాతారావు, మేరుగు నాగేశ్వరరావు, గంగరాజు, సొసైటీ చైర్‌పర్సన్ వెలగా శ్రీనివాసరావు, మత్స్యశాఖాధికారులు పాల్గొన్నారు.

శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



ఫిట్ ఇండియా క్రీడాకారులతో అధికారులు

అచ్యుతాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని సీఐ ఆర్‌వీఎస్ఎస్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఇక్కడ నిర్వహించిన ఫిట్ ఇండియా ఆటల పోటీల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి యువత ఆటలపై శ్రద్ధ తక్కువ చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడల్లో రాణిస్తే మనోవికాసంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పొందవచ్చన్నారు. వాలీబాల్, ఖోఖో, రన్నింగ్, లాంగ్‌జంప్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేరా యువభారత్ డీడీ జి మహేశ్వరరావు, ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్, ఎన్ఎస్ఎస్ రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఆర్ లీలాప్రసాద్, మేరాభారత్ వలంటీర్ వీసం రమ్య పాల్గొన్నారు.

డీసీసీబీ బ్రాంచిల వద్ద సహకార ఉద్యోగుల ధర్నా రేపు

ఎలమంచిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల ఐక్య వేదిక నాయకుల పిలుపు మేరకు డీసీసీబీ బ్రాంచిల వద్ద ఈనెల 8వ తేదీన ధర్నా చేస్తామని ఉమ్మడి జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల పరపతి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈనెల 29వ తేదీన చలో విజయవాడ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉద్యోగులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు



గౌరీపరమేశ్వరులను దర్శించుకున్న సాయికృష్ణ, మంజు తదితరులు

మునగపాక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో చూచుకొండలో శనివారం గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. గ్రామంలో దశాబ్దాలు కాలంగా రామాలయంవీధి, పెంటకోటవారి వీధుల్లో వేర్వేరుగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను నిర్వహిస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం రెండు ప్రాంతాల్లో వేడుకలు జరిగాయి. రామాలయం వీధి ఆధ్వర్యంలో సాయంత్రం గౌరీపరమేశ్వరులకు అరటిగెల్లతో సారె ఊరేగించారు. రెండు ఆలయాల్లో ఉన్న గౌరీపరమేశ్వరులను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ వేర్వేరుగా దర్శించుకున్నారు. రెండు ప్రాంతాలకు చెందిన గౌరీపరమేశ్వరులు ఉత్సవం ఒకేరోజు జరగడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు.

గంజాయి వినియోగిస్తున్న ఇద్దరి అరెస్టు

ఎలమంచిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి వినియోగిస్తున్న ఇద్దరినిని అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ సావిత్రి శనివారం తెలిపారు. పట్టణ ఎస్‌ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పాత రైల్వే క్వార్టర్స్ వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు శనివారం మధ్యాహ్నం ఘటనా స్థలానికి పోలీసులు వెళ్లారు. పోలీసులను చూసి వారిద్దరూ తప్పించుకునేందుకు ప్రయత్నించగా చాకచక్యంగా పట్టుకున్నారు. వారిని విచారించగా గాజువాక జంక్షన్ వద్ద ఒక సన్యాసి నుంచి గంజాయి కొనుగోలు చేసి ఇక్కడ వినియోగిస్తున్నట్టు తులసీనగర్‌కు చెందిన సింగంపల్లి రమణ, రామ్‌నగర్‌కు చెందిన మడుగుల అజయ్‌కుమార్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి, వారిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ సావిత్రి తెలిపారు. వారి వద్ద నుంచి 50 గ్రాముల గంజాయి, ఒక బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

అంగన్‌వాడీల్లో అన్ని సదుపాయాలు

- ఎమ్మెల్యే విజయకుమార్



అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. శనివారం సెజ్ పునరావాస కాలనీ (దిబ్బపాలెం)లో రూ.16లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కేంద్రాల్లో చిన్నపిల్లలను సాకడంతో పాటు గర్భిణులు, బాలింతలకు కూడా చక్కని సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజాన సన్యాసినాయుడు, భైలపూడి శ్రీరామదాసు, రాజాన విజయ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లాలం రాజు, ద్వారపురెడ్డి బాహుజీ, తుమ్మల రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి ఘంటసాల పాటల పోటీలు

ఎలమంచిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గానగంధర్వుడు పద్మశ్రీ ఘంటసాల వేంకటేశ్వరరావు 103వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో ఆదివారం రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు ఆడారి పూరి జగన్నాథం, వనుం నాగేశ్వరరావు తెలిపారు. ఘంటసాల కళామందిర్ ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని, పురుషులైతే ఘంటసాల గానం చేసిన పాటలు, స్త్రీలు అయితే ఘంటసాల సారథ్యం వహించిన పాటలు మాత్రమే అనుమతినిస్తామని నిర్వాహకులు తెలిపారు. పాటల పోటీలు అనంతరం సాయంత్రం నర్సీపట్నంకు చెందిన శ్రీను ఆర్కెస్ట్రా అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి సీహెచ్. శంకర్ పాల్గొన్నారు.

రాళ్లచెరువులో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర



ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ ప్రసాదరాజు, మునిసిపల్, సచివాలయ సిబ్బంది

ఎలమంచిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు సూచించారు. శనివారం పట్టణంలో మునిసిపల్, సచివాలయ సిబ్బంది స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని రాళ్లచెరువు ఆవరణలో సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మునిసిపాలిటీని అందరి సమన్వయంతో పరిశుభ్రంగా ఉంచుదామన్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయమందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్, సచివాలయాల సిబ్బంది చెరువు ఆవరణను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, ప్రజలకు పరిశుభ్రతపై సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, మేనేజరు విజయకుమార్, ఏఈ నానాజీ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థుల్లో ఒత్తిడి లేకుండా చూడండి

- మండల ప్రత్యేకాధికారిణి విజయ

నక్కపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టెన్త్ విద్యార్థులపై ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసేలా సన్నద్ధం చేయాలని మండల ప్రత్యేకాధికారిణి విజయ సూచించారు. శనివారం ఎంపీడీవో బీ చైతన్య ఆధ్వర్యంలో పలు హైస్కూళ్ల హెచ్‌ఎంలతో టెన్త్ పరీక్షలకు సంబంధించి సమీక్ష జరిపారు. గత ఏడాది ఫలితాలను అధిగమించాలని, టెన్త్ విద్యార్థుల కోసం నూరు రోజుల కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా కొనసాగించాలన్నారు. ఇదే సమయంలో పరీక్షలంటే విద్యార్థుల్లో భయం లేకుండా చేయాలని సూచించారు. కొన్ని సబ్జక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో ఎంఈవోలు నరేశ్, నాగన్నదొర, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎస్‌వీఎస్ ఆచార్యులు, సీనియర్ హెచ్‌ఎంలు వేమగిరి నూకరాజు, బాలాజీ, శ్రీలక్ష్మి, బషీర్‌ఖాన్, చిన్నతల్లి, సంధ్యారాణి పాల్గొన్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గంపల చినరాజు

పాయకరావుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన టీడీపీ నాయకుడు, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ గంపల చినరాజు కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ముంజులూరి దుర్గాప్రసాద్, ఏడిద సురేష్ శనివారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గంపల చినరాజుకి ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న రాష్ట్ర హోం మంత్రి అనిత ఆసుపత్రి యాజమాన్యంతో ఫోన్ మాట్లాడి గంపల చినరాజు కాలికి ఆపరేషన్ చేయించారన్నారు.

ఎలమంచిలిలో డివిజన్ ఏర్పాటు చేయాలని ర్యాలీ



ర్యాలీ చేస్తున్న రెవెన్యూ సాధన సమితి ప్రతినిధులు

ఎలమంచిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసినట్టయితే అన్ని ప్రాంతాలకు అనుకూలంగా ఉంటుందని వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం ఎలమంచిలి గుర్రప్ప కల్యాణ మండపంలో రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలు, మేధావులు, ప్రజాప్రతినిధులు సమావేశమయ్యారు. మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కొఠారు సాంబ మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్‌పై ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయాలన్నారు. పెన్షనర్స్ సంఘాధ్యక్షుడు సీహెచ్. సోమేశ్వరరావు మాట్లాడుతూ ఎలమంచిలిని రెవెన్యూ కేంద్రం ఏర్పాటు చేస్తే అన్ని ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ మేరకు నివేదికను సోమవారం జిల్లా కలెక్టరు, ఇతర అధికారులు, ఎంపీ, ఎమ్మెల్యేలకు అందజేసేందుకు సాధన సమితి ప్రతినిధులు తీర్మానించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి తహశీల్దారు వరహాలుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బొద్దపు యర్రయ్యదొర, దాసరి కుమార్, ఆడారి పూరి జగన్నాథం, సీహెచ్. సోమేశ్వరరావు, పప్పు ఈశ్వరరావు, యల్లపు రాజు, ఆడారి భాస్కరరావు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరంలో 62 మందికి పరీక్షలు

ఎలమంచిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లైనుకొత్తూరులో శనివారం ఎలమంచిలి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరంలో 62 మందికి పరీక్షలు చేశారు. శ్రీవిష్ణు దంత అండ్ కాస్మిక్ కేర్ వైద్యులు డాక్టర్ అర్జున అప్పారావు ఆడారి, సత్యసాయినాథ్ రోగులను పరీక్షించి మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పి. సత్య జగ్గారావు, గ్రామస్థులు, జాతీయ సేవా పథకం విద్యార్థులు పాల్గొన్నారు.

దాడి సీతారామ్‌కు ఘన నివాళి

మునగపాక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సేవకుడు దాడి సీతారామ్‌కు పలువురు నివాళులర్పించారు. స్థానిక తులసీ కళావేదిక వద్ద శనివారం సంతాపసభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు సూరిశెట్టి రమణ పాల్గొన్నారు.


భీమునిగుమ్మంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బత్తుల, పీలా


జిల్లా టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాగజగదీశ్వరరావు


సబ్బవరంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దళిత నేతలు

వాడవాడలా అంబేడ్కర్ వర్ధంతి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వాడవాడలా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి శనివారం నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లోనూ అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనకాపల్లి పట్టణంలోని భీమునిగుమ్మం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడే అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ నేత అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేశ్, కూటమి నాయకులు పోలారపు త్రినాథ్, దాడి జగన్, తలారి లక్ష్మీప్రసాద్, దాడి బుజ్జి, కాయల ప్రసన్న పాల్గొన్నారు.

అలాగే నెహ్రూచౌక్‌లో డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొణతాల నీలిమాభాస్కర్, డీవీఎంసీ సభ్యులు రేబాక మధుబాబు, నాయకులు విల్లూరి పైడారావు, కోటిపల్లి శ్రీను పాల్గొన్నారు. రింగురోడ్డులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోడి వెంకటరావు, కుప్పిలి జగన్, బుద్ద భువనేశ్వరరావు, సాలాపు నాయుడు, పొలిమేర నాయుడు తదితరులు పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

తుమ్మపాలలో...

తుమ్మపాల: అనకాపల్లి మండలంలోని పలు గ్రామాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి జరిగింది. తుమ్మపాల ఇందిరానగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బవుల వాడలో అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీటీసీ సభ్యుడు తోటాడ విజయ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా

విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు


కశింకోటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీడీవో చంద్రశేఖరరావు

కార్యదర్శి రాజాన దొరబాబు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. దళితుల హక్కుల కోసం పోరాడిన యోధుడు అని కొనియాడారు. బౌద్ధ మతంలోకి మారి దళిత బౌద్ధ ఉద్యమానికి మార్గదర్శకుడు అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి తాకాశి వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి వియ్యపు రాజు, నాయకులు వైఎన్ భద్రం, శేఖరమంత్రి సాయి, కోరిబిల్లి శంకరరావు, నరాల శెట్టి సత్యనారాయణ, మత్తుర్తి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో...

కొత్తూరు: భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం శనివారం జరిగింది. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొటివాడ సామ్రాట్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ ప్రజలందరికీ ఆర్థిక, లింగ భేదం లేకుండా అందరికీ సమానత్వం కలిగేలా రాజ్యాంగంలో పొందుపరిచిన మహనీయుడు అంబేడ్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డేడ నాగేశ్వరరావు, కొండకర్ల పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ గొంతిన భక్తసాయిరాం, మహిళా మోర్చా అధ్యక్షురాలు ఓరుగంటి నాగమణి, మండల అధ్యక్షుడు నరసింగ్‌యాదవ్, నాయకుడు ఉడా రమేశ్, తదితరులు పాల్గొన్నారు.


కశింకోటలో...

కశింకోట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీడీవో చంద్రశేఖరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా హక్కులను కల్పించిన ఘనత అంబేడ్కర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగంలో కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వే రిటైర్డ్ ఆధికారి ఉడిగుల నరసింగరావు, రిటైర్డ్ వీఆర్‌ఏ మంత్రి అప్పారావు, నాయకులు దొమ్మేని సత్యారావు, మంత్రి చంటి, శివలంక జగ్గారావు, పావాడ సన్యాసిరావు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం: మండలంలోని సబ్బవరం, ఆరిపాక, బంగారమ్మపాలెం, అంతకాపల్లి, మొగలిపురం, అమృతపురం తదితర గ్రామాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. మొగలిపురం వైసీపీ నేత గండి రవికుమార్ అంబేడ్కర్ చిత్రపటానికి, సబ్బవరం సాయినగర్ కాలనీలో దళిత నాయకులు బొర్రా జయరాజ్, దువ్వ దుర్గాలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గండి రవికుమార్ తదితరులు మాట్లాడుతూ.. డాక్టర్ అంబేడ్కర్ నేటి యువతకు ఆదర్శమన్నారు. కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాటం జరిపిన సామాజిక ఉద్యమ నేత అని కొనియాడారు. ఆయన ఏ ఒక్క వర్గానికో, మతానికో నాయకుడు కాదన్నారు. ఈ కార్యక్రమాల్లో దళిత నాయకులు ఐడీ బాబు, ఐ.గోపి, కొమ్ము కోటి, మనోహర్, దొమ్మేసి ఈశ్వరరావు, కృష్ణ, పుచ్చ తాతబాబు, సోంబాబు, కొమ్ము రవి, శివ, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి



కశింకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర ధ్యాన మందిరంలో శనివారం స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తెల్లవారుజామున మంత్రోచ్ఛరణలతో పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారిని తులసి, చామంతి, బంతిపూలు, పట్టువస్త్రాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీచరణ్ అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రేపు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగరం ఎస్‌ఆర్ శంకరన్ భవనంలో సోమవారం పీజీఆర్‌ఎస్ నిర్వహించనున్నట్టు జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హాజరవుతారన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతులను ఎమ్మెల్యే స్వీకరిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

గణతంత్ర దినోత్సవ ప్రీ ఆర్డీసీ శిబిరానికి సెయింట్ జాన్స్ విద్యార్థి


ఆశిష్

కశింకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెహిదీపట్నం గారిసన్ గ్రౌండ్‌లో ఈ నెల 7 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న ప్రీ ఆర్డీసీ క్యాంప్-2కు సెయింట్ జాన్స్ తొమ్మిదో తరగతి విద్యార్థి కొత్తపల్లి ఆశిష్ ఎంపికయ్యాడని కరస్పాండెంట్ బి.అనురాధ తెలిపారు. ఈ శిబిరంలో దేశవ్యాప్తంగా ఎంపికయ్యే ఉత్తమ క్యాడెట్లను ఢిల్లీలో 2026 గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రిన్సిపాల్ రూపానంది, స్కూల్ ఏఎన్‌వో కె.వేదిక విద్యార్థి ఆశిష్‌ను అభినందించారు.

చండీయాగ మహోత్సవంలో రుద్రాభిషేకాలు

కొత్తూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని గాంధీనగరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న శత చండీయాగ మహోత్సవం శనివారం నాటికి 8వ రోజుకు చేరుకుంది. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన మహోత్సవం రాష్ట్ర అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యుల వేదమంత్రాల మధ్య రేజేటి చక్రవర్తి, కన్నబాబు, మారుతి ఆధ్వర్యంలో రుద్రాభిషేకాలు చేశారు. కార్పొరేటర్ మందపాటి సునీత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అన్నమాచార్య అమృతవర్షిని బృందం, ప్రముఖ సంగీత విద్వాంసులు తోలేటి బుచ్చిబాబు శిష్య బృందంతో వీణ స్రవంతి, భక్తి రంజని కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

తుమ్మపాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీదేవిపేటలోని అభయాంజనేయస్వామి ఆలయ 18వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారు అభయాంజనేయ లక్ష్మీనరసింహస్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధనను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దొడ్డి శ్రీనివాసరావు, పీలా తులసీరాం, దొడ్డి జగ్గారావు, ఆడారి రాజు, బూడిద నాగేశ్వరరావు, దొడ్డి శంకరరావు, దాడి వెంకట సన్యాసిరావు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఉపాధి కల్పించాలి

విశాఖ ఫార్మాసిటీ ఎండీకి మాజీ ఎమ్మెల్యే వినతి

పరవాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధిలోని మత్స్యకారులకు ఫార్మాసిటీలో ఉపాధి అవకాశాలు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కోరారు. ఈ మేరకు శనివారం విశాఖ ఫార్మాసిటీ ఎండీ లాల్‌కృష్ణను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఫార్మా వ్యర్థ జలాలు సముద్రంలో కలవడం వల్ల మత్స్య సంపద నశించి మత్స్యకారుల జీవనోపాధి అగమ్యగోచరంగా తయారైందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు కల్పిస్తామని గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగా మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, నాయకులు బొంది అచ్చిబాబు, గంజి సురేష్, సూరాడ మసేను, సూరాడ యల్లాజీ, సూరాడ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఐడీ బాబు



సబ్బవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగలిపురానికి చెందిన వైసీపీ నేత ఇందుగుబిల్లి దేముడు బాబు (ఐడీ బాబు) పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రధాన కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయని దేముడుబాబు తెలిపారు. తనకు పదవి రావడానికి కారకులైన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించి పార్టీని అభివృద్ధి చేస్తానన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

లంకెలపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా బాలల రక్షణ అధికారి రమేశ్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాల జరిగితే 1098 నంబరకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు మనోహర్, రమాదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు ప్రశంసనీయం

▸▸ జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా


హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా.... (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఎస్పీ

అనకాపల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖకు హోంగార్డులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో 63వ హోంగార్డు ఆవిర్భావ వేడుకలను శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా హోంగార్డులు నిర్వహించిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డుల వ్యవస్థ పోలీసు శాఖకు వెన్నుముక లాంటివన్నారు. స్వచ్ఛంద సేవా స్ఫూర్తితో ప్రారంభమైన ఈ సంస్థ, నేడు ప్రజా భద్రతలో కీలకపాత్ర పోషిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత ప్రతీ పౌరుడి బాధ్యత

▸▸ అనకాపల్లి డీఎస్పీ శ్రావణి



విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న డీఎస్పీ, పోలీసులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నియమాలు పాటించడం ప్రతీ పౌరుడు బాధ్యత అని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి పేర్కొన్నారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహనలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీని డీఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా నెహ్రూచౌక్‌లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి వివిధ ప్ల కార్డులను ప్రదర్శించారు. మద్యం తాగి వాహనం నడపరాదని, అతి వేగంగా వెళ్లకూడదని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించాలని, మైనర్లు వాహనాలు నడపరాదంటూ నినాదాలు చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ వాహన చోదకులు నిబంధనలకు అనుగుణంగా పయనించాలని సూచించారు. రోడ్డు భద్రతపై విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాద రహిత అనకాపల్లి లక్ష్యసాధనలో భాగస్వాములు కావాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు అన్ని విధాలా సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, ఎస్‌ఐ శేషగిరిరావు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చేపట్టాలి

పరవాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రావాడ పంచాయతీ పరిధిలోని గొల్లగుంట శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు సుజాతనగర్‌లో శనివారం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. గత నెల పనులు ప్రారంభించారని, కోలమ్స్‌కు ఫుటింగ్ కూడా జరిగిందని పేర్కొన్నారు. అర్ధాంతరంగా పనులు నిలిపివేశారని, అందుకు కారణాలు తెలియరాలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. తక్షణమే అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు ఆలీ, మౌలాలీ, మదీనా, అన్సార్, మహ్మద్ రఫీ తదితరులు కోరారు.

డైట్‌లో 'పైసా వాలా' యూనిట్ సందడి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పైసా వాలా చిత్రం యూనిట్ సభ్యులు సందడి చేశారు. చిత్ర దర్శకుడు కె.నవీన్‌తేజ, నిర్మాత ఎస్.పైడిరాజు, నవీన్ కొర్రపాటి, అద్విక్ శ్రీధర్, సృజన కిత అరుణ్ తదితరులు హాజరై విద్యార్థులతో ఆటపాటలతో సందడి చేశారు. అలాగే వారితో విద్యార్థులు సెల్ఫీలు దిగారు.

పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవాల్లో ఎమ్మెల్యే కొణతాల


పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల... (ఇన్‌సెట్‌లో) నేతాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

అనకాపల్లి టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచించారు. మెయిన్‌రోడ్డులోని జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల 1975 పదో తరగతి బ్యాచ్ స్వర్ణోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ బ్యాచ్ కమిటీ ఏర్పాటు చేసిన నేతాజీ సుభాస్ చంద్రబోస్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పదో తరగతి బ్యాచ్ స్వర్ణోత్సవాలు జరుపుకోవడం అంటే బంగారు అక్షరాలతో లిఖించడమేనన్నారు. అనకాపల్లి అభివృద్ధికి ఎంహెచ్ స్కూల్, అనకాపల్లి వర్తక సంఘం ఏర్పాటు చేసిన కళాశాల ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. ఇంతమంది పూర్వ విద్యార్థులను సమీకరించి ఒకేచోట కలవడం సామాన్య విషయం కాదన్నారు. అనకాపల్లి అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఒక ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకొని అక్కడ వనరులను ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలవాలని సూచించారు. హైస్కూల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఈ సందర్భంగా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యేను పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, ఇంటర్ రీజనల్ అధికారి ఎం.వినోద్‌బాబు, పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, గౌరవాధ్యక్షుడు పిల్లా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి మళ్ల లోకేశ్వరరావు, కోశాధికారి రాపేటి నారాయణరావు పాల్గొన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో సహా ఎన్టీఆర్ స్టేడియానికి ర్యాలీగా వెళ్లి ఆటపాటల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడానికే సీఎం సహాయ నిధి

▸▸ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ


సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న పీలా గోవింద సత్యనారాయణ

కశింకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేదలను ఆర్థికంగా ఆదుకోవడానికి సీఎం సహాయ నిధి ఎంతగానో దోహదపడుతున్నదని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మండలంలోని కశింకోట, తేగాడ, బయ్యవరం, కొత్తపల్లి, బుచ్చయ్యపేట, కన్నూరుపాలెం, అచ్చెర్ల, తీడ గ్రామాల్లో శనివారం 22 మందికి రూ.13.56 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి వైపు తీసుకువెళ్తున్న ఘనత సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌దేనన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు, నాయకులు కె.సతీశ్, వేగి గోపీకృష్ణ, ఎస్.సూర్యనారాయణ, కాయల మురళీ, గంగయ్య, షేక్ బాబర్, సిదిరెడ్డి శివ, బాబూరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు పలువురి ఎంపిక


డీఈఓ నుంచి నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు


అనకాపల్లి టౌన్/ఎస్.రాయవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కౌశల్-2025 పోటీలకు ఎంపికైన విద్యార్థులకు జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు శనివారం స్థానిక జీవీఎంసీ పట్టణ బాలికోన్నత పాఠశాలలో నగదు బహుమతి, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. నాతవరం మండలం గునుపూడి ఉన్నత పాఠశాల, ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం జడ్పీ ఉన్నత పాఠశాల, మునకపాగక మండలం పాటిపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్, చీడికాడ మండలం తురువోలు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. భారతీయ విజ్ఞాన మండలి ఆధ్వర్యంలో గ్రామీణ విద్యార్థుల్లో ప్రతిభాన్వేషణ, శాస్త్ర విజ్ఞానంపై అవగాహనను పెంచడానికి 2018 నుంచి కౌశల్ పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లాస్థాయిలో ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓతోపాటు సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీధర్‌రెడ్డి, కౌశల్ పోటీల జిల్లా సమన్వయకర్త పీఏఆర్‌వీ మహేశ్వరరావు, జోనల్ కో-ఆర్డినేటర్ కె.పార్థసారథి, స్థానిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రుధిరరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మీ సహిత రుద్ర హోమం

సబ్బవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దుర్గమాంబ ఆలయంలో మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా చివరి రోజు శనివారం శ్రీమహాలక్ష్మీ సహిత రుద్ర హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్రకుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొనడానికి వివిధ గ్రామాల నుంచి తిఅధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దంగేటి నాగేశ్వరరావు, కోరాడ శ్రీనివాసరావు, బర్ల రమణ, కర్రి బాబు, గండి దేముడు, కోన సోమేశ్వరరావు, ఉసిరికల రమేశ్, గుడ్ల నాని తదితరులు పాల్గొన్నారు.

హోటళ్ల యాజమానులు అప్రమత్తంగా ఉండాలి

పరవాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హోటళ్లకు వచ్చే వారి పట్ల యాజమాన్యాలు అప్రమత్తంగా వ్యవహరించాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు సూచించారు. పోలీసుస్టేషన్‌లో పరవాడ ప్రాంత హోటళ్ల యాజమాన్యాలతో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. హోటళ్లకు వచ్చే కస్టమర్ల వివరాలతో పాటు ఫొటోలు తప్పనిసరిగా సేకరించాలని ఆదేశించారు. వారి పూర్తి అడ్రస్, గుర్తింపు పత్రాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రతి హోటల్ ప్రాంగణంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు దృష్టికి వస్తే తక్షణమే సమాచారమివ్వాలని కోరారు. నిబంధనల మేరకు యాజమాన్యాలు నడుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు.



సంతలో పార్చిమెంట్ కాఫీ గింజలు



రాజ్‌మా..



విక్రయానికి సిద్ధంగా ఉన్న ఎర్రదుంపలు

కాఫీ రైతులకు వ్యాపారుల టోకరా

» హుకుంపేట సంతలో తక్కువ ధరకు కొనుగోలు

» పార్చిమెంట్ కిలో రూ. 280 చెల్లింపు

హుకుంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న మన్యంలోని కాఫీ పంటను దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. శనివారం జరిగిన స్థానిక వారపు సంతలో నిర్దేశించిన ధరకంటే తక్కువగా కాఫీ గింజలను కొనుగోలు చేశారు. పార్చిమెంట్ కిలో కాఫీ రూ. 280 నుంచి రూ. 300కు విక్రయించినట్టు రైతులు తెలిపారు. గిరిజన సహకార సంస్థ ప్రకటించిన కిలో రూ. 450కు వ్యాపారులు కొనుగోలుచేసిన దాఖలాలు లేవని రైతులు వాపోతున్నారు. జీసీసీ సిబ్బంది అందుబాటులో లేక సంతవ్యాపారులు తమకు నచ్చిన విధంగా కొనుగోలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నారు. దీంతో కాఫీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. హుకుంపేట సంత పెద్దదైనదిగా గుర్తింపుఉంది. ఇక్కడే గిట్టుబాటు రాకపోవడంతో కాఫీ పంటను వ్యాపారుల అడిగిన ధరకు విక్రయిస్తున్నారు. తెచ్చిన పంటను తిరిగి గ్రామాలకు తీసుకువెళ్లలేక వదిలించుకునే దుస్థితి కనిపిస్తోంది. అధికారులు స్పందించి సంతలో నిల్వ చేయడానికి గొడౌన్ సదుపాయం కల్పించి, ప్రభుత్వ పరంగా కాఫీ పంటను కొనుగోలు చేయాలని గిరిజన రైతులు డిమాండ్ చేస్తున్నారు.

తగ్గిన రాజ్‌మా, ఎర్రదుంపల ధర

సంతలో రాజ్‌మా చిక్కుళ్లకు ధర రాలేదు. గత రెండు వారాలు కిలో రూ. 200 పైగా కొనుగోలు చేయగా, ఈ సారి గిరిరైతులు రూ. 90నుంచి రూ. 100 విక్రయించారు. ఎర్ర దుంపలు గత నెలలో బస్తా రూ.1500 విక్రయించగా, గత రెండు వారాలనుంచి బస్తా రూ. 700 మాత్రమే పలుకుతోంది. నాగెల దుంప కిలో గతంలో రూ. 30లుంటే ఈ సారి రూ. 10, బొస్తురి పిక్కలు కిలో గతనెల రూ. 200పైన ఉండగా, ఈ వారం రూ. 90 నుంచి 100కు మాత్రమే కొనుగోలు చేశారు. రోజు రోజుకు పంటలకు ధరలు తగ్గిపోవటంతో పెట్టుబడులు, శ్రమ దక్కడంలేదని రైతులు వాపోతున్నారు.

పంచాయతీల్లో అవకతవకలపై విచారణ: డీఎల్‌పీవో

పెదబయలు, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జామిగూడ, గలగండ పంచాయతీల్లో స్థానిక సర్పంచ్‌లు నిధులు దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపడుతున్నట్టు డీఎల్‌పీవో కుమార్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రాథమికంగా ఆయా పంచాయతీల రికార్డులను తనిఖీ కోసం ఆయన వచ్చారు.ఈ నెల 11 తేదీన మరోసారి విచారణ చేపడతామని పేర్కొన్నారు. జామిగూడ పంచాయతీలో సుమారు రూ. 33 లక్షల మేరకు స్థానిక సర్పంచ్ అవకతవకలకు పాల్పడినట్టు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గలగండలో సుమారు రూ. 3 లక్షల మేర పంచాయతీ నిధులను తప్పుడు పత్రాలు సృష్టించి స్థానిక సర్పంచ్ నిధులను దారి మళ్లించాచారని పెసా కమిటీ, గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.



మండల పరిషత్‌లో తనిఖీ చేస్తున్న డీఎల్‌పీవో కుమార్

తనిఖీల సమాచారం అందలేదు: జామిగుడ ప్రతినిధులు

జామిగూడ పంచాయతీలో సర్పంచ్ అవతవకలపై అధికారులు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించిన విషయంపై తమకు సమాచారం లేదని గ్రామ ఉప సర్పంచ్, ఆరుగురు వార్డు మెంబర్‌లు పేర్కొన్నారు. డీఎల్‌పీవో వస్తారని పంచాయతీకేంద్రంలో పడిగాపులు కాసినట్టు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో తనిఖీలు చేపడతామని తమకు తెలియదన్నారు.

కాఫీ పండ్ల ధర పెంపు

» మాతోట ఎఫ్‌పీవో సీఈవో చిన్నారావు

చింతపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాఫీ పండ్ల కొనుగోలు ధరను పెంచుతూ మాతోట రైతు ఉత్పత్తిదారుల సంఘం(ఎఫ్‌పీవో) బోర్డు ఆఫ్ డైరెక్టర్లు తీర్మానించినట్టు సీఈవో వనపల చిన్నారావు తెలిపారు. శనివారం మండలంలోని సాడిక గ్రామంలో కాఫీ పండ్లను మాతోట ఎఫ్‌పీవో ప్రతినిధులు కాఫీ పండ్లను కిలో రూ.80 ధరకు కొనుగోలు చేశారు. ఈసందర్భంగా మ్యాక్స్ సీఈవో మాట్లాడుతూ చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో నాబార్డు సహకారంతో మాతోట మ్యాక్స్ ఆదివాసీ రైతులు పండించిన కాఫీ పండ్లకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు. మార్కెట్ ప్రారంభంలో కిలో కాఫీ పండ్లను రూ.60 ధరకు కొనుగోలు చేశామన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ధరలు ఆధారంగా మరో రూ.20 ధరను పెంచామన్నారు. ఆర్గానిక్ ధ్రువపత్రం కలిగిన రైతులకు కిలో పండ్లకు రూ.5 అదనంగా చెల్లించనున్నట్టు చెప్పారు. రవాణా ఖర్చులుండవమని, ఎఫ్‌పీవో ప్రతినిధులు గృహాల వద్దకు వచ్చి పండ్లను కొనుగోలు చేసి తీసుకువెళ్తారన్నారు. గిరిజన రైతులు కాఫీ పండ్లను ప్రైవేటు వర్తకులకు విక్రయించి నష్టపోరాదన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన వికాస్ కార్యదర్శి నెల్లూరి వెంకట సత్యనారాయణ, మాతోట ఎఫ్‌పీవో సేకరణ మేనేజర్ కంకిపాటి గాంధీ పడాల్ పాల్గొన్నారు.



సాడికలో కిలో కాఫీ పండ్లను కొనుగోలు చేస్తున్న మాతోట ఎఫ్‌పీవో ప్రతినిధి

స్టోన్ క్రషర్ పనులతో ఇక్కట్లు



నిట్టాపుట్టు పాత క్వారీని పరిశీలిస్తున్న రాజుబాబు

జి.మాడుగుల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగర్భ పంచాయతీ జి.నిట్టాపుట్టు సమీపంలోని స్టోన్ క్రషర్‌తో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని సీపీఐ నాయకుడు జల్లి రాజుబాబు అన్నారు. ఇక్కడి క్వారీతో పాటు క్రషర్‌ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాత క్వారీలో వందల మీటర్ల లోతులో తవ్వి అవి పూడ్చకుండా వదిలేయడంతో ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. క్రషర్ వల్ల పరిసరాల్లోని సిల్వర్, కాఫీ తోటలు నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన క్వారీల్లో బ్లాస్టింగ్‌లో స్థానికులు ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే అధికారులు క్వారీని మూయించాలని రాజుబాబు కోరారు.

చిరు ధాన్యాల వంటకాలపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న మత్స్యదేవత ఎఫ్‌పీవో రైతులు

జి.మాడుగుల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చిరు ధాన్యాల పంటకాలపై శిక్షణనిస్తున్నట్లు మత్స్యదేవత ఎఫ్‌పీవో సీఈవో హనుమంతరావు తెలిపారు.శనివారం చింతపల్లి మండలం లంబసింగిలో ఐఐఎంఆర్ హైదరాబాద్ వారి సహకారంతో రాగులతో లడ్డు, మాల్టు, రాగి రొట్టె తదితర పంటకాలపై శిక్షణ ఇచ్చారు. గిరిజనులు అభివృద్ధి శిక్షణ దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఐఎంఆర్ వైద్యాధికారి రఫీ, ఎఫ్‌పీవో రైతులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహశీల్దార్

అనంతగిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయిలో విద్యాప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని తహశీల్దార్ వీరభద్రచారి అన్నారు. డముకు గ్రామంలోని శనివారం మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు సంఖ్య, హాజరు పరిశీలించారు. అనంతరం మ ధ్యాహ్నం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంటలపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఉపాధ్యాయులు మంజునాథ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న గిరిజన యువత

గూడెంకొత్తవీధి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రింతాడ గ్రామ పంచాయతీ కేంద్రంలో రెడ్ క్రాస్ సొసైటీ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. శనివారం స్థానిక రింతాడ గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాల ఆవరణలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని మన్యపుత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఐదేళ్లగా ప్రతి ఏటా మన్యపుత్ర యువజన సంఘం రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నది. ఈసారి శిబిరంలో గిరిజన యువతీ, యువకులు 42మంది రక్తదానం చేశారు. ఈసందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ 2025లో గిరిజన ప్రాంతంలో వెయ్యి యూనిట్ల రక్తం సేకరించామన్నారు. ఈ కార్యక్రమంలో మన్యపుత్ర యువజన సంఘం అధ్యక్షుడు, ఉప సర్పంచ్ సోమేశ్, సభ్యుడు రాజేశ్, రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్ రాఘవేంద్ర, సబ్ ఇన్‌స్పెక్టర్ సురేశ్, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమిత్ర, జీవిత సభ్యులు లోహితాస్, మణి పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లగిశపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ అధికారి గౌరీశంకరరావు

పాడేరురూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గిరిజన రైతుల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి.గౌరీశంకరరావు సూచించారు. లగిశపల్లి దత్తత గ్రామంలో చేపట్టిన ఎన్ఎస్ఎస్ శిబిరం శనివారం నాలుగోరోజుకు చేరింది. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.అనంతరం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, బాల్య వివాహాలకు స్వస్తి చెప్పాలన్నారు. వాణిజ్యపంటలపై అవగాహన కల్పించారు. అనంతరం ముగ్గులు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు డాక్టర్. డి.సునీత దేవి, ఈవీ.జయలక్ష్మి, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్థులు, వలంటీర్లు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా సత్యప్రసాద్



పెదబయలు, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా మద్దిల సత్యప్రసాద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మండలంలోని 23 పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. సిబ్బంది సమన్వయంతో అర్హులకు పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు.

పింఛను సొమ్ము రికవరీ

కొయ్యూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎం. మాకవరం సచివాలయ వెటరనరీ అసిస్టెంట్ కుటుంబీకుల నుంచి పింఛను సొమ్ము రికవరీ చేసినట్టు స్థానిక ఎంపీడీవో జీవీవీ ప్రసాదరావు తెలిపారు. ఈ నెల 1 వ తేదీన పింఛన్ల పంపిణీకి గానూ సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ కంకిపాటి చైతన్య వరప్రసాద్‌కు రూ. 2.88 లక్షలు కేటాయించగా, ఆ సొమ్ము పంపిణీ చేయకుండా అదృశ్యమైన విషయం విదితమే. ఈ మేరకు సచివాలయ పరిధిలోని ఎం మాకవరం, చింతలపూడి కార్యదర్శులు ఎంపీడీవో సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్ఐ కిశోర్‌వర్మ చైతన్య వరప్రసాద్ ఆచూకీ గుర్తించి ఆయన కుటుంబీకుల నుంచి శనివారం రూ. 2.88 లక్షలు రికవరీ చేసి తనకు అందించారని ఎం పీడీవో తెలిపారు. ఈ నగదును ఎస్ఈఆర్‌పీ ఖాతాకు చలానా ద్వారా జమచేశామన్నారు. వరప్రసాద్‌పై కలెక్టరు తదుపరిచర్యలు తీసుకుంటారని ఎంపీడీవో వివరించారు.

రోడ్డు నిర్మాణంలో ఘాటీ తగ్గించాలని ఆందోళన



నందిగుమ్మి-మద్దిగరువు మధ్యలో ఆందోళన చేపడుతున్న గిరిజనులు

అనంతగిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దూరు నుంచి మాలింగవలస, పాతకోట, మీదుగా రేగం నందిగుమ్మి, మద్దిగరువు గ్రామాలకు కలుపుకుంటూ నిర్మిస్తున్న రోడ్డులో సుమారు 200 మీటర్ల ఘాటీని తగ్గించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. శనివారం ఆయా గ్రామాల గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వైస్ సర్పంచ్ అర్జున్, సీపీఎం నాయకుడు నాగులు మాట్లాడుతూ.. నందిగుమ్మి- మద్దిగరువు మధ్యలోరోడ్డు భారీగా ఘాటీ వల్ల రానున్న రోజుల్లో ప్రమాదాలకు గుర య్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం పీవీటీజీ ఇళ్ల నిర్మాణానికి మెటీరియల్ తరలించేందుకు లారీ వెళ్లక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జన్ని పండన్న, టీడీపీ నాయకులు దామోదర్, ఆనంద్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ పాపినాయుడు

డుంబ్రిగుడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించకుజా మద్యంతాగి వాహనాలు నడిపినా కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ పాపినాయుడు హెచ్చరించారు. స్థానిక జాతీయ రహదారిలో చాప రాయి జలవిహారి సమీపాన శనివారం వాహనాల తనిఖీ చేశారు. వాహదారుల వద్ద తప్పనిసరి రికార్డులు కలిగి ఉండాలన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

చింతపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతర్ల గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఉపాధ్యాయుడికి తీవ్రంగా గాయాలయ్యాయి. అంతర్ల గ్రామానికి చెందిన సాగిన సోమలింగం లంబసింగి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. శనివారం పాఠశాల ముగించుకుని ఇంటికి ప్రయాణమయ్యారు. అంతర్ల వద్ద మలుపు తిరుగుతుండగా ఎదురుగావస్తున్న కారు ఢీకొంది. దీంతో ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడుని స్థానికులు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఏరియా ఆస్పత్రికి ఓఎన్‌జీసీ వితరణ

» 40 ఆక్సిజన్ సిలిండర్లు, 20 కాన్సంట్రేట్స్ అందజేత



పరికరాలు అందజేసిన ఓఎన్‌జీసీ డీసీఎంవో రామ్మోహన్, పక్కన డీసీహెచ్ఎస్ డాక్టర్ నీలవేణి

చింతపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రికి రాజమండ్రి ఓఎన్‌జీసీ 40 ఆక్సిజన్ సిలిండర్లు, 20 కాన్సంట్రేట్స్ మిషన్లు విరాళంగా అందజేసినట్టు మెడికల్ సూపరింటెండెంట్, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం. నీలవేణి తెలిపారు. శనివారం ఓఎన్‌జీసీ డీసీఎంవో (ఇన్‌చార్జి మెడికల్) డాక్టర్ వై. రామ్మోహన్ వీటిని ఏరియా ఆస్పత్రికి వైద్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నీలవేణి మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలకు అత్యవసర సమయాల్లో అవసరమైన ఆక్సిజన్ సిలిండర్లు, కాన్సంట్రేట్స్‌ని అందజేయడం ఆనందదాయకమని అన్నారు. వీటి వల్ల ఆదివాసీ రోగులకు మెరుగైన సేవలందుతాయన్నారు. ఏరియా ఆస్పత్రితోపాటూ కేజీహెచ్, పాడేరు జిల్లా ఆస్పత్రి, తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 200 ఆక్సిజన్ సిలిండర్లు, 200 కాన్సంట్రేట్స్‌ను అందజేసినట్టు ఓఎన్‌జీసీ ప్రతినిధులు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ అనస్థీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. రమేశ్, ఓఎన్‌జీసీ హెచ్ఆర్ ఎంఆర్ యశ్వంత్ అంబటి, స్థానిక ఈఎన్‌టీ వైద్యనిపుణులు చందన పాల్గొన్నారు.

ఘనంగా హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం



హోంగార్డులను అభినందిస్తున్న జెన్‌కో అధికారులు

సీలేరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో 63 వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఏపీ జెన్‌కో సెక్యూరిటీ హెడ్‌గార్డు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మెయిన్ డ్యాం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జెన్‌కో అధికారులు, ఇంజనీర్లు, సిబ్బంది హాజరై హోంగార్డులకు శుభాకాంక్షలను తెలియజేశారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా సూచించారు.నిజాయితీగా విధుల్లో మెలిగినప్పుడే రాణిస్తారని స్థానిక ఎస్ఐ యాసిన్ ఈ సందర్భంగా సూచించారు. ఈ సందర్భంగా హోంగార్డులు విందు భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో ఈఈలు రాజేంద్రప్రసాద్, జైపాల్, , భాస్కరరావు, ఏవో ఈవీవీ సత్యనారాయణ, ఏడీఈ అప్పలనాయుడు, ఏఈఈ సురేష్, జేఏవో వై. సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి: ఎస్ఐ

సీలేరు, డిసెంబరు 6 , (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్ఐ ఎండీ యాసిన్ అన్నారు. శనివారం సీలేరు బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విద్యార్థి దశలోనే తన భవిష్యత్తును నిర్దేశించుకుని కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అవగాహన కల్పించారు. విద్యార్థులు కొంతమంది వ్యసనాలకు గురవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇకపై ఇలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలో సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ బుచ్చిబాబు పాల్గొన్నారు.


బ్యాంక్ ఖాతా, ఫోన్ నంబర్లు ఇతరులకు ఇవ్వొద్దు: సీఐ

పాడేరురూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఖాతా నెంబర్లు, సెల్ ఫోన్ నంబర్లను ఇతరులకు ఇవ్వవద్దని స్థానిక సీఐ సన్యాసినాయుడు అన్నారు. ఆర్థిక సాక్షరత, మోసాల నివారణపై గ్రామీణ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ చేపట్టిన దేశ వ్యాప్త అర్థసూత్ర సంబాద్ కార్యక్రమాన్ని మండలంలోని మినుములూరులో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ మోసగాళ్లు, గంజాయి ఏజెంట్లు లాభాలు పొందుతుంటే అమాయక గిరిజనులు శిక్ష అనుభవిస్తున్నారన్నారు. సైబర్ మోసాలకు గురైన వారు 1930 హెల్ప్‌లైన్‌కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణమూర్తి, చైతన్య శ్రవంతి సంస్థ డైరెక్టర్ మాలిని, పాఠశాల హెచ్ఎం సోములు, బజాజ్ ఫైనాన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన

గూడెంకొత్తవీధి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డ్రైనేజీ నిర్మాణానికి ఎంపీటీసీ సభ్యురాలు, టీడీపీ మండలప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగమణి శనివారం శంకుస్థాపన చేశారు. రూ. 2 లక్షల మండల పరిషత్ నిధులతో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రహదారికి ఓవైపు డ్రైనేజీ నిర్మాణానికి నాగమణి కేటాయించారు. ఈమేరకు ఆమె భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రీమల రాజేశ్వరి, కో ఆప్షన్ సభ్యుడు దావుద్, వైసీపీ నాయకుడు అంజి పాల్గొన్నారు.

విద్యార్థినులకు సోలార్ పీవీ టెక్నీషియన్ కోర్సులో శిక్షణ



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఎంపీడీవో

చింతపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన నిరుద్యోగ విద్యార్థినులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఉపాధి అవకాశాలు మెరుగు పర్చుకోవాలని స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రంలో వాసవ్య మహిళా మండలి గిరిజనవిద్యార్థినులకు ఏర్పాటు చేసిన సోలార్ పీవీ టెక్నీషియన్ కోర్సు శిక్షణను ఎంపీడీవో ప్రారంభించారు. ఈ ప్రాంతానికి చెందిన 70మంది విద్యార్థినులకు పది రోజుల పాటు కోర్సులో శిక్షణ అందజేస్తారు. సోలార్ ఇన్‌ఫ్రా ఎనర్జీ సిస్టం ప్రైవేటు లిమిటెడ్ వ్యవస్థాపకుడు టీవీ సాయిఫణి మాట్లాడుతూ ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి, వాసవ్య మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ సునీతరాణి, ఎస్ ఎనర్జీ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు శ్రీసత్య శేఖర్, మండల కోఆర్డినేటర్ సుబ్బారావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం

» వర్ధంతి సభలో పాడేరు టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరురూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ 69వ వర్ధంతిని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె అంబేడ్కర్ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోమెలి చిట్టిబాబు, డప్పోడి వెంకటరమణ, బి.జ్యోతికిరణ్, ఎల్. అప్పలరాజు, వి.కొండలరావు పాల్గొన్నారు. అలాగే,టీడీపీ డివిజన్ నాయకుడు పాంగి పాండురంగ స్వామి ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి చేపట్టారు. ఈ కార్యక్రమంలో కె.అచ్చిబాబు, యువ, మెడికల్ ఉద్యోగుల సంఘం నాయకుడు శెట్టి నాగరాజు పాల్గొన్నారు.ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్. వనుము చిట్టబ్బాయి మాట్లాడారు. వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎన్.రసూల్, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి.గౌరీశంకరరావు, అధ్యాపకులు డి.సునీతా దేవి, పి.కోటేశ్వరరావు, జి. భాస్కరరావు, వి.రమేశ్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్.విశ్వప్రసాద్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు నాగేంద్రబాబు, దిలీప్‌కుమార్, కేశవ, రాధాకృష్ణ, మహేశ్వరి, పుణ్యవతి పాల్గొన్నారు. పాత బస్టాండ్‌లో విగ్రహం వద్ద ఏబీవీపీ నాయకులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఎంఎంఎల్.పాత్రుడు, వి.కృష్ణమూర్తి, వెంకట్, సంజయ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు. బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెనుమాక రవికుమార్ ఆధ్వర్యంలో నాయకులు అంబేడ్క ర్‌కు నివాళులు అర్పించారు. చల్లా రామకృష్ణ, పాంగి రవిచంద్ర, కె.వెంకటరమణ, ఎల్.అబ్బాయిదొర, ఎల్.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: సీలేరు అంబేడ్కర్ విగ్రహానికి జెన్‌కో ఈఈ లు రాజేంద్రప్రసాద్, జైపాల్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలను వేశారు. ఈ కార్యక్రమంలో పదవీ విరమణ చేసిన పంప్డ్ స్టోరేజీ ఎస్ఈ బి చంద్రశేఖర్ రెడ్డి, ఏవో ఈవీవీ సత్యనారాయణ, ఏడీఈలు శ్రీనివాస్, అప్పలనాయుడు, ఏఈఈ సురేష్, వై సత్తిబాబు, దొరరాజు, నాగేశ్వరరావు, , శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో నివాళి అర్పిస్తున్న కూటమి నాయకులు

చింతపల్లి: అణగారిన వర్గాల హక్కుల కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన సేవలు చిరస్మరణీయమని టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి కూటమి నాయకులు పూలమాలలువేసి నివాళి అర్పించారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శాస్త్రవేత్తలు మహాపరినిర్వాణ దివస్ నిర్వహించారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గెమ్మెలి అబ్బాయినాయుడు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, ఏఎంసీ డైరెక్టర్లు పెదిరెడ్ల బేతాళుడు, సేవా ఈశ్వరమ్మ, కృష్ణమూర్తి, చిన్న, జనసేన మండలాధ్యక్షుడు వంతల బుజ్జిబాబు, శాస్త్రవేత్త జోగారావు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని చిలకలగెడ్డ ఆశ్రమ బాలురు పాఠశాలలో హెచ్ఎం ఎస్.సైమన్, ఉపాధ్యాయుడు నరాజీ మల్లేశ్వరరావు, శెట్టి రాంబాబు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. విద్యార్థులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఈశ్వరి, తదితరులు

అరకులోయ: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో డాక్టర్ బిఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శశికుమార్, పొలిటికల్ సైన్స్ హెచ్ఓడీ డి.కె. ధర్మారావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. చొంపి గ్రామంలో అంబేడ్కర్ సంఘం ఆర్గనైజర్,గ్రామ పెద్ద మల్లేశ్,వార్డు మెంబర్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు.సీపీఎం మండల కార్యదర్శి రామారావు, నాయకులు పాల్గొన్నారు.



పాడేరులో విగ్రహానికి పూల మాల వేస్తున్న ఏబీవీపీ నాయకులు



చిలకలగెడ్డలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



అరకు డిగ్రీ కళాశాలలోనివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

భూ సమస్యల పరిష్కారానికి కృషి: ఆర్డీవో

గొలుగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈనాం భూముల సర్వే నిర్వహించి పరిష్కారానికి కృషి చేస్తున్నామని నర్సీపట్నం ఆర్డీవో వీవీ.రమణ తెలిపారు. మండలంలోని శనివానం కొత్తఎల్లవరం, జమ్మవరంల్లో ఈనాం రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ నుంచి ఈనాం భూముల సర్వే చేపడుతున్నామన్నారు. సాగుదారులు సహకరించాలని తెలిపారు. కొత్త ఎల్లవరం రెవెన్యూలో 1611, జమ్మవరం రెవెన్యూలో 740 ఎకరాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహశీల్దార్ రామారావు, సర్పంచ్ కొల్లి రాంబాబు, టీడీపీ నాయకులు శెట్టి దొరబాబు, కొల్లి గోవింద్, స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే తహశీల్దార్ కార్యాలయంలో భూ సమస్యలపై శనివారం ప్రజా వేదిక నిర్వహించారు. ఎస్ఐ రామారావు, డిప్యూటీ తహసీల్దార్ చెయిన్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పాకలపాడు, కశిమి, జానకీరాంపురం, పాతమల్లంపేట గ్రామాల్లో భూ సమస్యలపై హాజరైన రైతులతో చర్చించారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోండి

నాతవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అధికారుల సమక్షంలో ఇరు వర్గాల వారు సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఇన్‌చార్జి తహశీల్దార్ మహేశ్ సూచించారు. మండల కేంద్రంలో శనివారం మండల ప్రత్యేక అధికారి మంగవేణి అధ్యక్షత మండల స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ, ఇప్పటివరకు మండలంలో వివిధ గ్రామాల నుంచి తమ దృష్టికి 41 ఫిర్యాదులు రాగా, వాటిలో 22 సమస్యలను పరిష్కరించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యశ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుకు సేవా పురస్కారం



హోంగార్డుకు పురస్కారం అందిస్తున్న ఎస్పీ

నాతవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు ఎ.వరహాలు విధుల్లో ఉత్తమ సేవలందించడంతో ఎస్పీ తుహిన్‌సిన్హా చేతుల మీదుగా సేవా పురస్కారం, నగదు అందుకున్నారు. 63వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ పురస్కారం అందుకోవడంపై స్థానిక ఎస్ఐ తారకేశ్వరరావు, సిబ్బంది అతనిని అభినందించారు.

గంజాయి జోలికి వెళ్తే కఠిన చర్యలు

గొలుగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నాటుసారా, గంజాయి రవాణా చేపడితే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ మోహన్‌రావు హెచ్చరించారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. తన పరిధిలో గొలుగొండ, నాతవరం మండలాల్లో నాటుసారా, క్రయ విక్రయాలతోపాటు తయారీపై నిఘా ఉంటుందన్నారు. నాటుసారా జోలికి వెళ్తే ఆస్తులు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో యువత, ప్రజా ప్రతినిధులు నాటుసారా నిరోధానికి సహకరించాలని కోరారు.

ఎన్‌జీవోస్ ఎన్నికలకు నామినేషన్ల స్వీకారం

నర్సీపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నాన్ గెజిటెడ్, గెజిటెట్ అసోసియేషన్ నర్సీపట్నం తాలూకా యూనిట్ సాధారణ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని నర్సీపట్నం తాలూకా అధ్యక్షుడు సిహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఉదయం తొమ్మిది నుంచి నామినేషన్ల స్వీకరణ, మధ్యాహ్నం 1 గంటకు అభ్యర్థుల జాబితా ప్రకటన, 2 గంటల నుంచి పరిశీలన ఉంటుందన్నారు. అలాగే 8వ తేదీన నామినేషన్ల ఉప సంహరించుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 14న అబీద్ సెంటర్‌లో ఎన్జీవోస్ హోమ్ మొదటి అంతస్థులో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఎన్నికల అధికారిగా కోటవురట్ల యూనిట్ అధ్యక్షుడు రమణ వ్యవహరిస్తారని చెప్పారు.

ముమ్మరంగా వరి కోతలు



ఘాట్‌రోడ్డు సమీపంలో వరి పంటను కోస్తున్న కూలీలు

మాడుగుల రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ముప్పు తొలగడంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ఇటీవల తుఫాన్ల ప్రభావంతో తేలికపాటి జల్లులతో మోస్తరు వర్షాలు పడ్డాయి. దీంతో కోతకు వచ్చిన వరి పంట దెబ్బతింటుందనని రైతులు ఆందోళన చెందారు. తుఫాన్ ప్రభావం తొలగిపోవడంతో వరి కోతల పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. వరి పంటను కోసి పనలు ఆరబెట్టడం, ఆరిన పనలను కట్టలు కట్టి ఎడ్లబళ్ల సాయంతో కల్లాలకు తరలించడం, నూర్పుడు యంత్రాలతో పంటను నూర్పించడం వంటి పనులు చేస్తున్నారు. కొన్నిచోట్ల కోసిన పంటను ఆరబెట్టి నూర్చేందుకు వరిమేట్లు వేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో మండలంలో 13వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. ఇప్పటివరకు 30 శాతం వరి కోతలు పూర్తయ్యాయని, ఈ నెలాఖరుకి కోతలు పూర్తయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని మండల వ్యవసాయాధికారిణి అనసూయ తెలిపారు.

హిందూ సంప్రదాయాలను మంటగలపొద్దు

▸▸ ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు స్పష్టీకరణ



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ సభ్యులు

మాడుగుల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):హిందూ సంప్రదాయాన్ని మంటగలపొద్దని, హిందూ సంప్రదాయాల పట్ల విదేశాల్లో మంచి ఆదరణ ఉందని ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు స్వామి విష్ణు దేవానంద సరస్వతి, భయ్యా వాసు పేర్కొన్నారు. శనివారం స్థానిక శతకం పట్టు వద్ద నిర్వహించిన హిందూ సమ్మేళన కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు డిసెంబరు 31 వంటి విదేశీయులు చేసుకొనే వాటిని మనం జరుపుకోవడం సిగ్గుచేటు అని అన్నారు. ప్రతి ఒక్కరూ హిందూ సంప్రదాయ పద్ధతులను కాపాడుకోనే విధంగా సమ్మేళనాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు శ్రీనాథ శ్రీనివాసరావు, చదలవాడ జయమ్మ, ప్రభాకర్, వాలంకి శ్రీను, కోడూరి కొండలరావు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళులు

నర్సీపట్నం/నర్సీపట్నం అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. అబీద్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేవీపీస్ నాయకుడు ఈరెల్లి చిరంజీవి, సీఐటీయూ నాయకుడు దంట్ల శివ పాల్గొన్నారు. అలాగే చెట్టుపల్లిలో రెల్లి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధి ఎర్రంశెట్టి పాపారావు, గ్రామ సర్పంచ్ నాగరత్నం సూరిబాబు, జనసేన నేత చక్రవర్తి పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...



దేవరాపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

దేవరాపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నతుడని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం అంబేడ్కర్ 69వ వర్ధంతిని స్థానిక అంబేడ్కర్ యూత్ సంఘం ప్రతినిధులు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరాపల్లి నాలుగురోడ్ల కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంటమ్మ, మాజీ.ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కాటపల్లి సృజన తదితరులు పాల్గొన్నారు. అలాగే అంబేడ్కర్ కాలనీలో విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో కె.శ్రీను, కేవీ.రమణ, వి.సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో..

అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మండలంలోని వడ్డాది అరుంధతి కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహనికి పలువురు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కండేళ్లి వరహాలు, కొండబాబు, యేసునవీన్ మహేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కరక, చిట్టియ్యపాలెం, తురకలపూడి, రాజాం, బుచ్చెయ్యపేట గ్రామాలలో అంబేడ్కర్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు.

మాడుగులలో..

మాడుగులలోని అంబేడ్కర్ కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 69వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దంగేటి సూర్యారావు, మండల సతీష్, మరువాడ ఈశ్వరరావు, కొట్టేడ మల్లికార్జునుడు, పల్లెల రామచంద్రమూర్తి, పంచాడ శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు సయ్యపురెడ్డి సత్తిబాబు, ఈర్ని సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చీడికాడలో..

మండల కేంద్రంలోని ఆటోస్టాండ్ వద్ద డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక దళిత సంఘం నాయకుడు గాలి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు శనివారం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పరవాడ మహేశ్, పరవాడ రామారావు, పరవాడ అప్పారావు పాల్గొన్నారు.



నర్సీపట్నం: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

గొలుగొండలో...

గొలుగొండ మండలంలోని అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. మండల కేంద్రంలోని దళిత కాలనీలో అంబేడ్కర్ విగ్రమానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరమండ వీరబాబు, కసిపల్లి అప్పారావు, బోయిన చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో...



కృష్ణాదేవిపేటలో నినాదాలు చేస్తున్న మహిళలు

ఎల్‌పురం, గాదంపాలెం, చోద్యం తదితర గ్రామాల్లో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఎల్‌పురం ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు, సర్పంచ్ లోచల సుజాత, పలు సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ సభ్యులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో...

మండలంలోని అన్ని గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. తామరం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి తూర్పుకాపు సంఘం మండల అధ్యక్షుడు హరిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

నాతవరంలో...

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ బడుగు వర్గాల అభ్యున్నతికి చేసిన పోరాటం మరవలేనిదని ఇన్‌చార్జి తహశీల్దార్ మహేశ్ పేర్కొన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఎన్నో దేశాలు తిరిగి అక్కడ రాజ్యాంగాలను అధ్యయనం చేసి భారతదేశానికి అనువైన రాజ్యాంగం తయారు చేశారన్నారు. తద్వారా భారతీయుల గుండెల్లో మంచిస్థానం పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జి.మంగవేణి, ఎంపీడీవో సత్యశ్రీనివాసు, వీఆర్వో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

▸▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చోడవరంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారానికి అవసరమైన పనులు చేపట్టాలని, నిధులు మంజూరు చేయించడానికి తాను సిద్ధంగా ఉన్నానని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రకటించారు. శనివారం ఉదయం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి పట్టణంలోని ద్వారకానగర్, కో-ఆపరేటివ్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ద్వారకానగర్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ కాలువల నిర్మాణంతో పాటు, వీధుల్లోని కాలువలను కూడా ప్రధాన కాలువకు లింకు చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారి శాంతారాంను ఆదేశించారు. కాలువల నిర్మాణంలో ఎక్కడైనా నాణ్యత లేకపోయినా, నీరు పారకుండా అడ్డదిడ్డంగా పనులు చేపట్టినా, అందుకు బాధ్యులైన నాయకులు, అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో శాంతారాం, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈఈ సీహెచ్‌వీ. నరసింగరావు, పంచాయతీ ఈవో శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, పెదబాబు, ఎర్రంశెట్టి చిన్న, దేవరపల్లి వెంకట అప్పారావు, గుమ్మాల సత్య, ఎలకా మల్లిబాబు, మెంబర్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వాదోపవాదాలతో విచారణ చేపట్టని అధికారులు

ఎంపీడీవోని ఏకవచనంతో సంబోధించిన ఫీల్డ్ అసిస్టెంట్

నోరు మూయ్ అంటూ హెచ్చరించి.. వెనుదిరిగిన ఎంపీడీవో

ఫిర్యాదుదారులు, మేట్లు బతిమిలాడినా తిరిగిరాని అధికారులు



ఎంపీడీవోని నిలదీస్తున్న స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ మోసూరి ఏసు

చీడికాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులు, మేట్లు, అధికారుల మధ్య జరిగిన వాదోపవాదాలతో విచారణ చేయకుండా అధికారులు వెనక్కి వెళ్లిపోయారు.ఈ ఘటన శనివారం మండలంలోని ఖండివరం సచివాలయం వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..

ఖండివరం టెక్నికల్ అసిస్టెంట్ మోహనరావు కొలతలు కొలవడానికి ఏ ఒక్కరోజు రాలేదని వేతనదారులు ఫిర్యాదు మేరకు నవంబరు 6వ తేదీన విచారణ జరిగింది. ఆ రోజు అధికారుల సమక్షంలో జరిగిన విచారణలో ఫిర్యాదుదారులు, మేట్లు, టెక్నికల్ అసిస్టెంట్ రాలేదని వెల్లడించారు. అయితే అధికారులు మాత్రం ప్రతి రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల్లోపు కొలతలు కొలిసినట్టు జిల్లా అధికారులకు రిపోర్టు పంపించారు. ఇది తప్పుడు రిపోర్టుని వేతనదారులు కొండలరావు, దండి ఈశ్వరరావు, మరికొందరు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎనిమిది మంది మేట్లు తొలగింపు, ఎంపీడీవో గతంలో జరిగిన విచారణకు రాకుండా వచ్చినట్టుగా ఏ విధంగా జిల్లా అధికారులకు రిపోర్టులు ఇచ్చారని పది రోజుల క్రితం పీజీఆర్ఎస్‌లో వారు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం మళ్లీ ఖండివరం సచివాలయంలో విచారణ నిర్వహించారు. ఈ విచారణలో ఎంపీడీవో వి.హేమసుందరరావు, ఏపీడీ బండారు శ్రీనివాసరావు, ఏపీవో అల్లు గంగునాయుడు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫిర్యాదుదారులు, మేట్లు తరలివచ్చారు. అలాగే ఎంపీటీసీ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, ఎస్‌వీఎస్.నాయుడు, గెంజి బాలాజీలు హాజరయ్యారు. సమావేశం ప్రారంభమైన వెంటనే తాత్కాలికంగా తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్ మోసూరి ఏసు లోపలకు వచ్చి 'నీకు గతంలో అన్ని ఆధారాలు ఇచ్చాను.. ఏమి రిపోర్టు రాశావురా' అంటూ ఏకవచనంతో ఎంపీడీవోని సంబోధిస్తూ.. లేనిపోని రిపోర్టులు జిల్లా అధికారులకు ఇచ్చి నా పొట్ట కొట్టి నా భార్యబిడ్డలు ఏడ్చేలా చేశావురా అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. దీనిపై ఎంపీడీవో హేమసుందర్రావు లేని నోరుమూయ్.. నీకు ఏమి సంబంధం అంటూ ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఫిర్యాదుదారులు, మేట్లు ఒక్కసారిగా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు లోపల నుంచి బయటకు వచ్చేశారు. మరో ఫిర్యాదుదారుడు గండి ఈశ్వరరావు ఇదే మాట మీ అధికారులను మేము అంటే మీరు ఒప్పుకుంటారా అని ప్రశ్నించారు. ఫిర్యాదుదారులు, మేట్లు మరలా కార్యాలయానికి వచ్చి విచారణ చేయాలని కోరినా అధికారులు వినిపించుకోకుండా ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు, మేట్లు మాట్లాడుతూ, ఎంపీడీవో హేమసుందర్రావు జిల్లా అధికారులకు ఇచ్చిన తప్పుడు రిపోర్టులు ఈ విచారణలో బట్టబయలు అవుతాయని ఏదో వంక పెట్టుకొని వెళ్లిపోయారన్నారు. దీనిపై సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తామని వారు విలేకరులకు తెలిపారు.

నేడు ఎన్ఎంఎంఎస్ పరీక్షలు

నర్సీపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ఎంఈవో సీహెచ్ తలుపులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఎనిమిది కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నర్సీపట్నంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీహెచ్ స్కూల్, జెడ్పీహెచ్ఎస్ (మెయిన్), ఏపీ అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాల, జెడ్పీహెచ్ బాలికల పాఠశాల, పెదబొడ్డేపల్లి జెడ్పీహెచ్ పాఠశాల, చైతన్య హైస్కూల్, డాన్ బాస్కో హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరిహారం

మాకవరపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో జి.కోడూరు అగ్ని ప్రమాదం బాధితులకు తహశీల్దార్ బి.వెంకటరమణ శనివారం పరిహారం అందజేశారు. గ్రామానికి చెందిన ఉడంపర్తి అప్పయ్యమ్మ, రాజేశ్వరి పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మళ్ల జయబాబు, పెంటకోట నాగేశ్వర్‌రావు రూ.55 వేల సమకూర్చారు. ఈ మొత్తాన్ని శనివారం బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రెండు ఆటోలు ఢీకొని ఒకరికి గాయాలు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొనడంతో డ్రైవర్ గాయపడ్డాడు. కొయ్యూరు మండలం బాలారం గ్రామానికి చెందిన బర్నికల నానిబాబు కృష్ణాదేవిపేట నుంచి ఆటోలో స్వగ్రామానికి వెళుతున్నాడు. ఈ క్రమంలో లింగంపేట గ్రామానికి చెందిన పాసింబిల్లి శివరామకృష్ణ తన ఆటోలో కృష్ణాదేవిపేట వస్తున్నాడు. శివరామకృష్ణ ఆటో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న నానిబాబు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివరామకృష్ణకు గాయాలయ్యాయి. డ్రైవర్ నానిబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించి ఆటోలను స్టేషన్‌కు తరలించారు. క్షతగాత్రుడ్ని ఆస్పత్రికి తరలించారు.

ఈవ్‌టీజింగ్‌కి పాల్పడితే కఠిన చర్యలు

నర్సీపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈవ్‌టీజింగ్ కి పాల్పడితే చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ ఎస్‌కే గఫూర్ హెచ్చరించారు. శనివారం ప్రభుత్వ గిరిజన సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహం-2ని సందర్శించి అక్కడ విద్యార్థులకు కౌన్సిలింగ్ చేశారు. క్రమ శిక్షణతో చదువుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు, ప్రత్యేక పోలీసులు ఏర్పాటు చేశామని తెలిపారు. బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

పాడి రైతుల సంక్షేమమే విశాఖ డెయిరీ లక్ష్యం

బుచ్చెయ్యపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమమే విశాఖ డెయిరీ లక్ష్యమని డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ అన్నారు. శనివారం కోమళ్లపూడిలో మృతి చెందిన కనిగిరి అమ్మతల్లి కుటుంబ సభ్యులకు విశాఖ డెయిరీ నుంచి రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని ఆయన అందజేశారు. విశాఖ డెయిరీ ప్రతి రూపాయి సభ్య రైతులకు ఖర్చు చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో గోకివాడ కోటేశ్వరరావు, డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా సబ్సిడీ విత్తనాలు

కె.కోటపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రబీ రైతులకు వేరుశనగ, మినుములు, పెసర విత్తనాలను సబ్సిడీపై అందజేస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ తెలిపారు. సబ్సిడీ పోనూ 30 కేజీల వేరుశనగ విత్తనాలు రూ.1,656లు, మినుములు నాలుగు కేజీలు రూ.386లు, పెసలు నాలుగు కేజీల బ్యాగు రూ.378లు రైతు చెల్లించాలన్నారు. రైతులు ఆధార్, వన్ బీ జెరాక్స్‌లను రైతు సేవా కేంద్రాల వద్ద చూపించి, డబ్బులు చెల్లించి విత్తనాలను పొందవచ్చునన్నారు.

చౌడువాడ పంచాయతీ కార్యదర్శి బదిలీ

కె.కోటపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడువాడ పంచాయతీ కార్యదర్శి పాలూరి సురేష్‌బాబు పదోన్నతిపై అనంతపురం మండలం గిడిజాల పంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఇక్కడ పంచాయతీ గుమస్తా డి.అప్పారావుకు ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు.

పేద విద్యార్థులకు వార్డు కార్యదర్శి చేయూత

రోలుగుంట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):మండలంలోని బుచ్చెంపేటలో చదువుకోవడానికి ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థులకు ఆ గ్రామ వార్డు కార్యదర్శి అనిమిరెడ్డి రమణ శనివారం ఆర్థిక చేయూత అందించారు. గ్రామానికి చెందిన తోటకూర నిత్య, తోటకూర కృష్ణలు పేదరికంతో బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండిపోతున్నారు. సమస్యను గ్రామానికి చెందిన పలువురు యువకులు వార్డు కార్యదర్శి రమణ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి తన మిత్రుడు లక్ష్మీనారాయణ సహకారంతో వారిని గ్రామపెద్దల సమక్షంలో పాఠశాలలో చేర్పించారు. ఆయా విద్యార్థులకు స్కూల్ బ్యాగు, పుస్తకాలు, రూ.2వేల ఆర్థిక సాయాన్ని అందించారు.

చోడవరం తాలూకా ఎన్‌జీవో సంఘం నూతన అధ్యక్షుడిగా సత్యనారాయణ



ప్రమాణ స్వీకారం చేసిన ఎన్‌జీవో అసోసియేషన్ నూతన కార్యవర్గం

చోడవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):చోడవరం తాలూకా ఎన్‌జీవో సంఘం నూతన అధ్యక్షుడిగా కె. సత్యనారాయణ ఎన్నికయ్యారు. శనివారం ఎన్‌జీవో సంఘం కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. కార్యవర్గం కార్యదర్శిగా బి. జ్ఞాని అశోక్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్‌వీ. రమణ, ఉపాధ్యక్షులుగా కె. రమణమ్మ, బి. గోవిందరాజు, కేవీ శివగణేశ్, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.సింహాచలం, పి. రాజేశ్వరి, బి.ఈశ్వరరావు ఎస్.అమ్మాజీ, కోశాధికారిగా కె.సింహాచలంనాయుడు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా జీవీ రమణబాబు, కె. శ్రీనివాసరావులు వ్యవహరించగా, పి.త్రినాథ్ పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఉద్యోగులు అభినందించారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

రోలుగుంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇతర శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష చేపట్టారు. ఏ ఏ శాఖల నుంచి ఏ ఏ అర్జీలు వచ్చాయో పరిశీలించారు. త్వరతగతిన పరిష్కరించాలని కోరారు. స్వచ్ఛాంధ్ర సాధనకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగమ్మ, ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఆర్ఐ రామమూర్తి పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత ఏపీని చేద్దాం

▸▸ ఐసీడీఎస్ పీవో ఎర్రయ్యమ్మ

మాడుగుల రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌గా చేద్దామని ఐసీడీఎస్ మాడుగుల పీవో ఎర్రయ్యమ్మ అన్నారు. శనివారం సాగరం గ్రామంలో మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంపు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. తల్లిదండ్రులకు కూడా బాల్యవివాహాలతో కలిగే అనర్థాలు వివరించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేచలంలో విద్యార్థులకు స్టడీ మెటీరీయల్ వితరణ

దేవరాపల్లి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేచలం జడ్పీ ఉన్నత పాఠశాలలో అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 20మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరీయల్ శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరావు, ట్రస్టు చైర్మన్ వెంకటరావు, సభ్యులు స్వామినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వయంభూ విఘ్నేశ్వరుడి సన్నిధిలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



సూర్యనారాయణను సత్కరిస్తున్న ఉద్యోగులు, స్థానికులు

చోడవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ శనివారం రాత్రి స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆయనకు ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో అర్చకులు ఆశీర్వచనం పలికారు. అంతకుముందు స్థానిక బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్, ఉద్యోగులు, స్థానిక ప్రముఖులు సూర్యనారాయణకు స్వాగతం పలికారు. ఆయన వెంట బుచ్చెయ్యపేట ఎంపీడీవో కె.శివప్రసాద్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు మనోహర్, గోపి, పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు శరగడం సాయి, ఆలయ కమిటీ చైర్మన్ పసుమర్తి సాంబమూర్తి, స్థానిక ప్రముఖులు ఉప్పలబాబు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అంకుపాలెంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలు

చోడవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకుపాలెంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పీవో బి.పిచ్చమ్మ ఆధ్వర్యంలో శనివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతతో పాటు వివిధ కార్యక్రమాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, స్థానిక సర్పంచ్ పరమేశ్వరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ముఖ్య అధికారిణి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


జైస్వాల్‌ను అభినందిస్తున్న విరాట్ కోహ్లీ


జైస్వాల్, రోహిత్‌శర్మ పరుగుల వేట


విరాట్ బ్యాటింగ్ విధ్వంసం


సెంచరీ సాధించిన డికాక్


స్టేడియంలో అభిమానుల కోలాహలం


జడేజా ఫీల్డింగ్ విన్యాసం

క్రికెట్ సంబరం

కీలక మ్యాచ్‌లో భారత్ అద్భుత ప్రదర్శనతో బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి సిరీస్ కైవసం చేసుకోవడంతో అభిమానులు సంబరాలు చేసుకున్నారు. రోహిత్, కోహ్లీ ఆటను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఉదయం నుంచి స్టేడియంలో వేచిచూసిన ప్రేక్షకులు అసలైన బ్యాటింగ్ మజా చవిచూశారు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ అద్భుత సెంచరీకి కరతాళధ్వనులతో కేరింతలు కొట్టారు. మొత్తమ్మీద పీఎం పాలెంలోని ఏసీఏ- వీడీసీఏ స్టేడియంలో భారత్- దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగిన వన్డే మ్యాచ్ సిసలైన క్రికెట్ మజాను అందించింది.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


బౌలింగ్ చేస్తున్న ప్రసిద్ధ్ కృష్ణ (4 వికెట్లు)



మ్యాచ్ తిలకిస్తున్న హోం మంత్రి అనిత, విశాఖ ఎంపీ శ్రీభరత్




రోహిత్ శర్మ వికెట్ తీసిన ఆనందంలో సౌతాఫ్రికా జట్టు



కులదీప్‌కు సూచనలిస్తున్న కోహ్లీ, బౌలింగ్ చేస్తున్న జడేజా


జైస్వాల్‌ను అభినందిస్తున్న సౌతాఫ్రికా కెప్టెన్ బవుమా


వికెట్ తీసిన ఆనందంలో భారత్ ఆటగాళ్లు


మ్యాచ్ ప్రారంభానికి ముందు దక్షిణాఫ్రికా జట్టు సభ్యులు

మూడు గంటలు ముందుగానే...

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో శనివారం భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన వన్డే మ్యాచ్‌కు డిజిటల్ టికెటింగ్ అమలు చేయడంతో ప్రేక్షకులు మూడు గంటల ముందుగానే స్టేడియానికి చేరుకున్నారు. నిర్వాహకులు క్యూఆర్ కోడ్‌ను ఉదయం 9.30 గంటలకే ఓపెన్ చేయడంతో ప్రేక్షకులు లోపలికి ప్రవేశించారు. సీట్లకు నంబరింగ్ లేకపోవడతో ముందు సీటు కోసం ఆసక్తి చూపారు. గ్యాలరీలు కిక్కిరిశాయి. 80 శాతం ప్రేక్షకులు విరాట్, రోహిత్ పేర్లతో ఉన్న భారత్ జెర్సీని పోలిన టీషర్టులు ధరించడంతో సేడియం నీలి రంగులోకి మారింది. రోహిత్, కోహ్లీని చూసి ప్రేక్షకులు కేరింతలతో స్వాగతం పలికారు. ఫీల్డింగ్‌లో విరాట్, రోహిత్ బాలు పట్టుకున్న ప్రతిసారీ చప్పట్లతో మార్మోగించారు. దారి పొడుగునా టీమిండియా ఆటగాళ్ల ఫ్లెక్సీలను ప్రదర్శించారు. లోకల్ బాయ్ నితీష్‌కుమార్ రెడ్డి ఫ్లెక్సీలు శుక్రవారం భారీగా ఏర్పాటు చేశారు. మ్యాచ్‌లో అతడు లేకపోవడంతో శనివారం ఉదయానికే తొలగించారు.

నితీష్‌కుమార్‌కు దక్కని చోటు

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ వీడీసీఏలో శనివారం దక్షిణాఫ్రికాతో తలపడిన భారత్ జట్టులో లోకల్ బాయ్ నితీష్‌కుమార్‌రెడ్డికి చోటు దక్కలేదు. సిరీస్ విజేత నిర్ణయించే కీలకమ్యాచ్ కావడంతో నితీష్‌కుమార్‌రెడ్డిని తుది జట్టులోకి తీసుకోవడంపై కోచ్ గంభీర్, కెప్టెన్ కెఎల్.రాహుల్ ఆసక్తి చూపలేదని తెలుస్తోంది. తొలి రెండు వన్డేల్లో వాషింగ్టన్ సుందర్ విఫలమవడంతో నితీష్‌కుమార్‌రెడ్డికి చాన్స్ దక్కుతుందని భావించారు. కానీ అతని స్థానంలో తిలక్ వర్మను తుది జట్టులోకి తీసుకున్నారు. దీంతో నితీష్‌కుమార్ మరోసారి బెంచ్‌కే పరిమితమయ్యాడు.

చోడవరం పంచాయతీ ఈవోపై ఎమ్మెల్యే ఆగ్రహం

... 5వ పేజీ తరువాయి

పర్యటన సందర్భంగా ఆయన పలుచోట్ల రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు చేస్తున్న దుకాణదారులను చూశారు. వ్యాపారులు ఇష్టారాజ్యంగా రోడ్డుపైకి వచ్చి మరీ దుకాణాలు పెడుతుంటే చోద్యం చూస్తున్నారా అని ప్రశ్నించారు. రోడ్డు పక్క దుకాణాలు పెట్టుకోవడానికి తాను అడ్డు చెప్పడం లేదని, కానీ రోడ్డును ఆక్రమించి, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదన్నారు. డ్రైనేజీలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు ఇచ్చి వెంటనే తొలగించాలని ఆదేశించారు.

వెలంపాలెంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

ఎస్.రాయవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలంపాలెం కొండ సమీపంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు అక్కడకు వెళుతుండగా.. గ్రావెల్ రవాణా చేస్తున్న ట్రాక్టర్ తారసపడింది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ సెల్ ఫోన్ ద్వారా ఈ విషయాన్ని తవ్వకందారులకు సమాచారం అందించాడు. మీడియా ప్రతినిధులు వెలంపాలెం కొండ సమీపంలోకి వెళ్లేసరికి ఇతర వాహనాలు, ఎక్స్‌కవేటర్‌తో వేరే మార్గంలో ఉడాయించారు. ట్రాక్టర్ గ్రావెల్‌ను రూ.2-3 వేలకు అమ్ముతున్నారని స్థానికులు చెబుతున్నారు. కాగా వెలంపాలెంలో జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలపై తాహశీల్దారు రమేశ్‌బాబును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. గ్రావెల్ తవ్వకాల కోసం ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. సంబంధిత వీఆర్‌వోను వెలంపాలెం కొండవద్దకు పంపుతానని తెలిపారు.


వెలంపాలెంలో కొండ సమీపంలో గ్రావెల్ తవ్విన ప్రదేశం

పరవాడలో రాష్ట్రస్థాయి టాంగ్-థా పోటీలు

పరవాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్‌స్టేడియంలో శనివారం టాంగ్-థా అండర్-14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు మొదలయ్యాయి. డీఈవో గిడ్డి అప్పారావునాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో ఏడు జిల్లాల నుంచి సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శులు కేఎం నాయుడు, పి.నాగేశ్వరరావు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ఎంఈవో ఎం.దివాకర్ రావు, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాధాకృష్ణ, స్థానిక నాయకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు పాల్గొన్నారు.

మృతదేహంతో మూడు రోజులు

» తల్లి పక్కనే మానసిక దివ్యాంగుడు

» అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

గాజువాక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తన తల్లి మృతిచెందిందని తెలియని ఓ మానసిక దివ్యాంగుడైన కుమారుడు మూడు రోజుల పాటు మృతదేహం పక్కనే ఉన్నాడు. ఇందుకు సంబంధించి గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొంతినవానిపాలెంలో పచ్చికోరు లక్ష్మి (65), తన చిన్న కుమారుడు సంతోషరావుతో కలిసి నివసిస్తోంది. పెద్ద కుమారుడు నాగేశ్వరరావు వారికి కొద్దిదూరంలోని దిబ్బపాలెంలో ఉంటున్నాడు. అతను గత మూడు రోజులుగా ఫోన్ చేస్తున్నప్పటికీ తల్లి నుంచి స్పందన లేకపోవడంతో అనుమానంతో శనివారం రాత్రి గొంతినవానిపాలెం వచ్చి చూడగా తల్లి లక్ష్మి మృతదేహం కనిపించింది. అతడి తమ్ముడు సంతోషరావు మరో గదిలో మంచంపై నిద్రిస్తూ ఉన్నాడు. దీంతో గాజువాక పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. లక్ష్మి మృతిచెంది మూడు రోజులు దాటి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.


ఒక గదిలో తల్లి విగతజీవిగా ఉండగా, మరో గదిలో నిద్రిస్తున్న కుమారుడు

వార్ వన్‌సైడ్

... 5వ పేజీ తరువాయి

కరతాళ ధ్వనులతో స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ఇక మూడో మ్యాచ్‌లోనూ రోహిత్ శర్మ అర్ధసెంచరీ సాధించాడు. 25 ఓవర్ల వరకు ఓపెనర్ల దూకుడు కొనసాగింది. 54 బంతుల్లో ఆరు బౌండరీలు, సిక్సర్‌తో రోహిత్ తన కెరీర్‌లో 61వ అర్ధ సెంచరీ పూర్తిచేయగా..మరో ఎండ్‌లో యశస్వి జైశ్వాల్ 75 బంతుల్లో మూడు బౌండరీలు, సిక్సర్‌తో అర్ధసెంచరీ పూర్తిచేశాడు. జోరుమీదున్న రోహిత్ శర్మ వ్యక్తిగత 75 పరుగులవద్ద తొలి వికెట్‌గా వెనుతిరగడంతో బ్యాటింగ్‌కు దిగిన విరాట్ కోహ్లీ తొలి బంతి నుంచీ స్కోరు బోర్డు పరుగులెత్తించాడు. ఈ దశలో యశస్వి జైస్వాల్ 111 బంతుల్లో పది ఫోర్లు, సిక్సర్‌తో వన్డే కెరీర్‌లో ఏడో సెంచరీ పూర్తిచేశాడు. విరాట్ 40 బంతుల్లో నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో 53వ హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. నిగిడి వేసిన 40 ఓవర్‌లో విరాట్ కోహ్లీ బౌండరీ బాది మ్యాచ్‌ను విజయవంతంగా ముగించాడు.

కనువిందు చేసిన విరాట్, రోహిత్

ప్రేక్షకుల కల నెరవేరింది. అభిమాన క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల బ్యాటింగ్ చూసేందుకు అష్టకష్టాలు పడి టికెట్లు సాధించుకున్న వారి ఆశ తీరింది. వీరిద్దరూ తమదైన శైలి బ్యాటింగ్‌తో ప్రేక్షకులకు కనువిందు చేశారు. సిక్సర్లు, బౌండరీలతో స్టేడియాన్ని హోరెత్తించారు. విరాట్, రోహిత్, జైస్వాల్ బ్యాటింగ్‌తో దక్షిణాఫ్రికా బౌలర్లకు చూపిస్తుంటే ప్రేక్షకులు కేరింతలతో స్టేడియంను హోరెత్తించారు. వీరు ముగ్గురూ బ్యాటింగ్ చేస్తున్నంత సేపూ స్టేడియంలోని ప్రేక్షకులంతా కుర్చీల్లోంచి లేచి నిలబడి మరీ తిలకించడం విశేషం.

నేడు ఎన్‌ఎంఎంఎస్ అర్హత పరీక్ష

... 5వ పేజీ తరువాయి

విద్యా సంవత్సరానికి సంబంధించి అర్హుల ఎంపిక కోసం ఆదివారం అనకాపల్లి, నర్సీపట్నంలో 17 కేంద్రాల్లో ఎన్‌ఎంఎంఎస్ అర్హత పరీక్ష నిర్వహిస్తున్నారు. నర్సీపట్నంలోని ఎనిమిది కేంద్రాల్లో 1,918 మంది, అనకాపల్లిలోని తొమ్మిది కేంద్రాల్లో 2,076 మంది.. మొత్తం 3,994 మంది పరీక్షకు హాజరుకానున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష వుంటుంది. అర్ధగంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. హాల్‌టికెట్ మీద ఉన్న క్యూర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పరీక్షా కేంద్రం రూట్ మ్యాప్ కనిపిస్తుందని తెలిపారు.

క్రైం... crime news

యువకుడి ఆత్మహత్య

మాడుగుల రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మాదేవిపేటలో ఒక యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి ఎస్‌ఐ నారాయణరావు శనివారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. జమ్మాదేవిపేటకు చెందిన మట్టా మోహనరావు కుమారుడు బాలు(19) ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణుడయ్యాడు. డిగ్రీలో చేరకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. దీంతో తల్లిదండ్రులు మందలించారు. మనస్తాపం చెందిన బాలు.. శుక్రవారం సాయంత్రం ఇదే గ్రామంలో అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. తరువాత మేడ మీద గదిలోకి వెళ్లారు. కొద్దిసేపటి తరువాత అమ్మమ్మ మేడపైకి వెళ్లి చూడగా.. బాలు ఫ్యాన్ హుక్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. ఆమె బిగ్గరగా అరవడంతో పక్కింట్లో వాళ్లు వచ్చి బాలును కిందకు దింపారు. కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకు వెళ్లగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేసి చేశారు.


బాలు(ఫైల్ ఫొటో)

కాలుష్య కాసారం

... 5వ పేజీ తరువాయి

'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. పీసీబీ అధికారులు స్పందించి వాగులో నీటి నమూనాలను సేకరించారు. వీటికి పరీక్షలు చేయగా రసాయనాలు ఉన్నట్టు గుర్తించి, గెడ్డలోని నీటిని మోటార్లతో తోడించి రాంకీకి చెందిన సీఈటీపీకి తరలించారు. తరువాత ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఫార్మా వ్యర్థాల కాలుష్యంపై మీడియాలో కథనాలు వచ్చినా, స్థానికులు ఫిర్యాదులు చేసినా, ప్రజా సంఘాలు ఆందోళనలు నిర్వహించినా.. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కనీసం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. రాంకీ యాజమాన్యం తమ ప్రాణాలతో చెలగాటమాడుతున్నదని స్థానికులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఫార్మా వ్యర్థ జలాలను బయటకు విడిచిపెడుతున్న రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి

ఆర్.గోపాలకృష్ణ, టీఎస్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు



ఫార్మా రసాయన వ్యర్థాలను శుద్ధి చేయకుండా బయటకు విడుదల చేస్తుండడంతో గెడ్డలు, చెరువులు కలుషితం అవుతున్నాయి. ఈ విషయంలో పీసీబీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రాంకీ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి.

26 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

... 5వ పేజీ తరువాయి

రాజేంద్ర ప్రసాద్‌కు ఫోన్ చేయగా.. కొద్దిసేపట్లో ఆయన చేరుకున్నారు. బియ్యం గురించి రైస్ మిల్లు నిర్వాహకులను విచారించగా, ఎస్.రాయవరానికి చెందిన పి.సత్యనారాయణ అనే వ్యక్తి బియ్యాన్ని పాలిష్ పట్టించేందుకు మిల్లుకు తీసుకువచ్చాడని, అయితే పాలిష్ చేయబోమని తాము చెప్పడంతో తిరిగి తీసుకుపోయేందుకు వాహనం కోసం వెళ్లాడని చెప్పారు. దీంతో సుమారు 26 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని డీటీ స్వాధీనం చేసుకొని లైనుకొత్తూరులోని గోదాముకు తరలించారు. బియ్యం తీసుకువచ్చిన పి.సత్యనారాయణపై 6ఏ కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644